
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
గురువారం 4 సెప్టెంబరు 2025





పల్లెలకు పైసలొచ్చాయ్!



జిల్లాల వారీగా నిధులు విడుదల ఇలా..		
జిల్లా	అన్‌టైడ్ నిధులు	టైడ్ నిధులు
• పల్నాడు	12,31,45,384	18,47,18,101
• బాపట్ల	9,34,29,265	14,01,43,899
• గుంటూరు	6,55,92,007	9,83,88,023

పంచాయతీలకు ఎట్టకేలకు నిధుల మోక్షం లభించింది. ఎనిమిది నెలల అనంతరం పంచాయతీల వారీగా వాటి బ్యాంకు ఖాతాలకు 15వ ఆర్థిక సంఘం రూ. 70.04 కోట్ల నిధులు జమ చేసే ప్రక్రియను ప్రభుత్వం బుధవారం ప్రారంభించింది. రెండు మూడు రోజుల్లో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పంచాయతీలకు నిధులు జమ అవుతాయని పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు తెలిపారు.

పంచాయతీల ఖాతాలకు రూ 70.04 కోట్లు జమ

- ఎట్టకేలకు నిధులు విడుదల చేసిన ఆర్థిక సంఘం
- నిధుల విడుదలతో పంచాయతీల పాలక వర్గాల హర్షం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గ్రామ పంచాయతీలకు 2024-25 సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులను జనవరిలోనే కేంద్రప్రభుత్వం విడుదల చేసింది. అయితే ప్రభుత్వం ఈ నిధులను పంచాయతీలకు విడుదల చేయకుండా తన ఖాతాలోనే ఉంచుకుంది. పంచాయతీల సర్పంచ్‌లు ఉద్యమ బాట పట్టిన నేపథ్యంలో నిధులను విడుదల చేసింది. పంచాయతీలకు అన్‌టైడ్ గ్రాంటు కింద రూ 28.21 కోట్లు, టైడ్ గ్రాంటు కింద 41.82 కోట్లు విడుదలయ్యాయి. ఈ మొత్తాన్ని జనాభా ప్రాతిపదికన పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తున్నారు. మొదటి విడతలో కొన్ని పంచాయతీలకు ఉన్న బకాయిలను కూడా ఆర్థిక సంఘం విడుదల చేసింది.



నిధులు విడుదలతో పంచాయతీలకు ఊరట

కనీసం బ్లీచింగ్ కూడా కొనలేని స్థితిలో పంచాయతీలు కొట్టిమిట్టాడుతున్న సమయంలో ఆర్థిక సంఘం నిధుల విడుదల ఊరట నిచ్చింది. మొత్తం నిధుల్లో 60 శాతం టైడ్ నిధులుగా, 40 శాతం అన్‌టైడ్ నిధులుగా విడుదలయ్యాయి. టైడ్ నిధులను ఓడీఎఫ్ నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తాగు నీటి సరఫరా, రహదారుల నిర్మాణం వంటి పనులకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ నిధులను నిబంధనల మేరకు ఖర్చు చేయాలి. ఇందుకు సంబంధించిన లెక్కలు పక్కాగా ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది. ఆర్థిక సంఘం నిధులు విడుదలైన ప్రతిసారీ పంచాయతీల విద్యుత్ బకాయిలకు కొంత మొత్తాన్ని చెల్లించాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది. అదే తరహాలో ఇప్పుడు అన్‌టైడ్ గ్రాంటుగా విడుదల చేసిన రూ.28.21 కోట్లలో పది శాతం విద్యుత్ బకాయిలకు కచ్చితంగా చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మరో పది శాతం నిధులను ఎల్‌ఈడీ వీధి దీపాల నిర్వహణకు, 20 శాతం నిధులను కాంట్రాక్ట్ సిబ్బంది వేతనాలకు, కంప్యూటర్ల కొనుగోలు, స్టేషనరీ ఇతర సామగ్రి కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించింది. అలాగే పాఠశాల భవనాల (మిగతా 8వ పేజీలో)

బార్లు బాధలు

- దరఖాస్తులకు స్పందన అంతంతే
- ఎక్సైజ్ అధికారులపై ఉన్నతాధికారుల కన్నెర్ర
- అన్నింటికీ లాటరీ జరగాలని అనధికారిక ఆదేశాలు
- నిర్దేశించిన స్థాయిలో దరఖాస్తులు రాకుంటే పోస్టింగులకే ముప్పు?
- గడువు పొడిగిస్తున్నా ముందుకురాని వ్యాపారులు.. తాజాగా రీనోటిఫికేషన్

రావాల్సిన దరఖాస్తులు ..

బాపట్ల జిల్లాలో తొలుత 17 బార్లకు నోటిఫికేషన్ వెలువడగా రెండింటికే మాత్రం నిబంధనల ప్రకారం దరఖాస్తులు రాగా 15 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీటికి కనీసం 60 దరఖాస్తులు రావాలి. అదేవిధంగా గుంటూరులో 67 బార్లకు 268, పల్నాడులో 30కి 120 దరఖాస్తులు ఈ నెల 14లోగా రావాల్సి ఉంది.



• బాబ్బాబు దరఖాస్తు వేయండి

నూతన ఎక్సైజ్ పాలసీ ప్రకారం మద్యం బార్లకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. రీ నోటిఫికేషన్ జారీ నేపథ్యంలో ఈసారి ఎలాగైనా మొత్తం బార్లకు లాటరీ ప్రక్రియ జరగాల్సిందేనని ఉన్నతాధికారులు హెచ్చరించారు. దీంతో వ్యాపారులు దరఖాస్తులు వేసేలా ఎక్కడికక్కడ ఎక్సైజ్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. గతంలో బెదిరించగా వ్యాపారులు స్పందించలేదు. దీంతో ఇప్పుడు బతిమిలాడుకుంటున్నారు. కొన్ని చోట్ల అధికార పార్టీ నేతలను కలిసి దరఖాస్తుల గండం నుంచి గట్టెక్కించాలని అభ్యర్థిస్తున్నారు. ఇద్దరు ముగ్గురు కలిసి నాలుగు దరఖాస్తులు వేస్తే ఆ బార్ వారికే వచ్చేలా చూస్తామని అధికారులు హామీ ఇస్తున్నట్లు సమాచారం. నిబంధనల విషయంలో కొంత లిబరల్‌గా కూడా ఉంటాం ముందు దరఖాస్తు చేయండని కూడా కోరుతున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మద్యం బార్ల పాలసీ ఎక్సైజ్ అధికారుల పాలిట శాపంలా మారిందా అంటే చోటుచేసుకుంటున్న పరిణామాలు అలాగే ఉంటున్నాయి. గతంలో మద్యం వ్యాపారం అంటే పెద్దఎత్తున పోటీ ఉండేది. ప్రభుత్వానికి దరఖాస్తుల రూపంలోనే రూ.కోట్లతో ఖజానా నిండేది. గతంలో వైన్స్ లైసెన్సుల జారీలోనూ ఇదే పరిస్థితి. అయితే గత నెలలో బార్లకు నోటిఫికేషన్ జారీ చేయగా వ్యాపారుల నుంచి కనీస స్పందన లేకుండా పోయింది. గడువు పొడిగించినా మూడో వంతు బార్లకు కూడా లాటరీ తీయలేకపోయారు. ఈ పరిస్థితుల్లో తాజాగా ఎక్సైజ్ శాఖ రీ నోటిఫికేషన్ జారీ చేసింది. బుధవారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించింది. అయితే దరఖాస్తులు వేసేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో అధికారుల బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఒకవైపు ఉన్నతాధికారుల హెచ్చరికలు.. మరోవైపు వ్యాపారుల నుంచి స్పందన అంతంతే కావడంతో ఎటూ పాలుపోని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు. రెండు సార్లు గడువు పొడిగించినా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో రెండు రోజుల క్రితం బాపట్ల జిల్లా ఈఎస్‌ను కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయించారు. బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్దేశించిన స్థాయిలో దరఖాస్తులు పడకపోతే వాటి పరిధిలోని ఎక్సైజ్ సీఐలపై కూడా వేటు తప్పదనే సంకేతాలను ఉన్నతాధికారులు పంపించారు. ఈ నేపథ్యంలో బాపట్ల జిల్లాలో 15, గుంటూరు జిల్లాలో 67, పల్నాడులో 30 బార్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రభుత్వం తాజాగా రీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 14 వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు, 15న లాటరీ ప్రక్రియ ముగించి బార్లను కేటాయించాలని అందులో తెలిపింది. ఈ క్రమంలో రంగంలోకి దిగిన అధికారులు దరఖాస్తుదారుల కోసం వేట మొదలుపెట్టారు. గతంలో నోటిఫికేషన్ వచ్చిన సమయంలో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై ఎక్సైజ్ అధికారులు (మిగతా 8వ పేజీలో)

సీనియర్స్ విభాగంలో వేటపాలెం ఎడ్ల సత్తా

- ప్రత్తిపాడులో ముగిసిన రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

8

పిడుగురాళ్ల షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలం

- జడ్పీ సీఈవో జ్యోతిబసు

నాగార్జున సాగర్ క్రస్ట్‌గేట్లు మూసివేత

6

పశ్చిమ డెల్టాకు 6,830 క్యూసెక్కుల నీరు

ఆర్టీసీ ఉద్యోగుల్లో ఆనందం

- డ్రైవర్, కండక్టర్లకు డబుల్ అలవెన్స్
- స్త్రీశక్తి అమలు నేపథ్యంలో ప్రభుత్వం శుభవార్త
- ఇప్పటికే నైట్ అలవెన్స్, ప్రమాద బీమా పెంపుదల

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించేలా స్త్రీశక్తి పథకం అమలు నేపథ్యంలో సిబ్బందికి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డబుల్ డ్యూటీలకు వెళ్లే డ్రైవర్లు, కండక్టర్లకు డబుల్ అలవెన్స్ ప్రకటించింది. ఇది స్త్రీ శక్తి అమల్లోకి వచ్చిన ఆగస్టు 15 నుంచి చెల్లించేలా ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ ఉద్యోగులపై తన ఉదారతను చాటుకుంటోంది. ఇప్పుడు ఇచ్చే అలవెన్స్‌కు రూ.200 అదనంగా ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దాంతో ఆర్టీసీ ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ హయాంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువగా జరుగుతోందని ఉద్యోగుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ విలీన ప్రక్రియలో భాగంగా రాత్రిళ్లు విధులు నిర్వహించే డ్రైవర్లు, కండక్టర్లకు వచ్చే నైట్ అలవెన్స్‌ను కూడా రద్దు చేశా రు. నైట్ అలవెన్స్‌ల కోసం పలు దఫాలు అప్పట్లో ప్రభుత్వ పెద్దలకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం రావడంతో ఆర్టీసీ ఉద్యోగులకు దశ మారింది. డ్రైవర్, కండక్టర్లకు నైట్ అలవెన్స్ అమల్లోకి తీసుకురావడంతో పాటు గతంలో రూ.75 ఉన్న దానిని రూ.150కి పెంచారు. తద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 1500 మందికి పైగా లబ్ధి చేకూరనున్నది. స్త్రీ శక్తి పథకం అమల్లో భాగంగా డబుల్ డ్యూటీలు చేసే డ్రైవర్, కండక్టర్లకు కూడా అలవెన్స్‌లు పెంచారు. ఇప్పటి వరకు డబుల్ డ్యూటీలు చేసే డ్రైవర్‌లకు రూ.800 ఇచ్చే వారు, ఇకపై డ్రైవర్‌కు రూ.వెయ్యి ఇవ్వనున్నారు. కండక్టర్‌కు రూ.700 నుంచి రూ.900 పెంచుతూ ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు ప్రమాద బీమాను ఉచితంగా అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రమాదవశాత్తు మరణిస్తే గతంలో రూ.20 లక్షలు ఉండే బీమాను రూ.కోటికి పెంచారు. అంతేగాక ఆర్టీసీలో అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నారు. ఆర్టీసీలో రాష్ట్రంలో 6500 మందికి ఉద్యోగోన్నతులు కల్పించారు. ఇందులో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉద్యోగోన్నతుల జాబితా సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.






సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, జేసీ సూరజ్‌ధనుంజయ్ గనోరే తదితరులు

జిల్లాలో యూరియా కొరత లేదు

- ఎరువుల అక్రమాలపై పీడీ యాక్టు
- కలెక్టర్ అరుణ్‌బాబు ప్రకటన

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబరుకి 34,556 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటి వరకు 36,615 మెట్రిక్ టన్నులు అందిందన్నారు. రైతులకు 26,616 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామని, ఇంకా 7,442 మెట్రిక్ టన్నుల నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనవసర భయాలతో రైతులు అవసరానికి మించి ఎరువులు కొనుగోలు చేయవద్దన్నారు. ఈ నెలాఖరుకు రాష్ట్రానికి వచ్చే యూరియా నిల్వల్లో జిల్లా రైతులకు అవసరమైన కేటాయింపులు ఉంటాయన్నారు. యూరియా అక్రమాలు అరికట్టేందుకు వ్యవసాయశాఖ, రెవెన్యూ, పోలీస్, మార్కెటింగ్ శాఖల సిబ్బందితో తనిఖీలు చేపట్టామన్నారు. అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అంచనాలకు మించి వర్షాలు కురవడం, సాగర్‌లో పుష్కలంగా నీరు ఉండటంతో గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎక్కువ విస్తీర్ణంలో సాగు జరుగుతుందన్నారు. గత సంవత్సరం సెప్టెంబరులో 82,000 హెక్టార్లలో సాగు చేయగా, ఈ సంవత్సరం అది 97,000 హెక్టార్లుకు చేరిందన్నారు. సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ ఎరువులపై రైతులు ఆందోళన చెందవద్దన్నారు. యూరియా అక్రమ రవాణా అడ్డుకునేందుకు పొందుగల, తంగెడ, నాగార్జునసాగర్ వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ యూరియా కొరతపై అసత్య వార్తలు ప్రచారం చేయవద్దని కోరారు. కార్యక్రమంలో జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్వో మురళి పాల్గొన్నారు.





గృహోపకరణాలు

వెదురుకు ఊతం



- జిల్లాలో 50 ఎకరాల్లో సాగు
- హెక్టారుకు రూ.60 వేలు సాయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అత్యంత వేగంగా పెరిగే.. పచ్చదనంతో పాటు పునరుత్పత్తి అయ్యే సహజ వనరు వెదురు(బాంబూ). తేమతో కూడిన వాతావరణంలో, వివిధ రకాల నేలల్లో బాగా పెరుగుతుంది. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోగల శక్తి కలిగి ఉంటుంది. వెదురు సాగును పెంచేందుకు జాతీయ బాంబూ మిషన్ అనేక రాయితీలను కల్పిస్తోంది. వెదురు సాగుపై రైతులకు ఉద్యానశాఖ అవగాహన కల్పిస్తోంది. జిల్లాలో ప్రధానంగా బీడు భూముల్లో వెదురు సాగును ప్రభుత్వం అధికంగా ప్రోత్సహిస్తోంది. ఇప్పుడిప్పుడే జిల్లాలో వెదురు సాగుకు రైతులు ఆశక్తి చూపుతున్నారు. ఇప్పటికే చిలకలూరిపేట, నూజెండ్ల, పిడుగురాళ్ల, మాచవరం, గురజాల, నరసరావుపేట తదితర మండలాల్లో 50 హెక్టార్లల్లో వెదురు సాగైంది. వెదురు సాగుకు ప్రభుత్వం ఊతం ఇస్తోంది. సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సాగుకు అయ్యే ఖర్చులో మొదటి రెండేళ్ల 60 శాతం వరకు చెల్లిస్తోంది. మొక్క నాటిన తర్వాత మూడేళ్ల వ్యవధిలో బాగా పెరుగుతాయి. నాలుగో సంవత్సరం నుంచి ఏటా వెదురు గెడలను కోయవచ్చు. ఒకసారి నాటిన మొక్కలు 40 ఏళ్ల వరకు లాభదాయకంగా నిలుస్తాయి. ప్రారంభ దశలో ఖర్చులు పోగా ఆరో సంవత్సరం నుంచి ఎకరాకు 1,50,000 పైబడి ఆదాయాన్ని పొందవచ్చు. ఈ పంటకు చీడపీడల తాకిడి కూడా ఉండకపోవడంలో రైతులు దీని సాగుపై ఆసక్తి చూపుతున్నారు. రైతు (మిగతా 8వ పేజీలో)

అనేక రంగాల్లో వినియోగం..

వెదురు వినియోగం అనేక రంగాల్లో విస్తరించి ఉంది. ప్రాచీన కాలం నుంచి ఇళ్ల నిర్మాణం, అగరబత్తీలు, ఫర్నిచర్, అలంకరణ వస్తువులు కూడా తయారవుతున్నాయి. వెదురు ఆకుల డికాషన్‌తో జీర్ణ సంబంధిత, నోటిపూత, చర్మ సమస్యలకు ఉపశమనం పొందవచ్చు. ఇటీవలి బాంబూ చికెన్, బాంబూ బిర్యానీలు కూడా ప్రాచుర్యం పొందాయి. వెదురు మొగ్గలను ఆహారంగా కూడా వినియోగిస్తున్నారు. కాగితపు పరిశ్రమలో ముఖ్యమైన ముడి పదార్థంగా వెదురు పనిచేస్తుంది.



ఆహారంగా వినియోగించే వెదురు గడ

108 అంబులెన్స్‌కు సుస్తీ

- అత్యవసర పరిస్థితుల్లో రోగుల అవస్థలు

మాచర్ల రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాల్సిన 108 అంబులెన్స్ మూలనపడింది. పరిస్థితి విషమించి అత్యవసరమైతే క్షతగాత్రుడ్ని జిల్లా కేంద్రానికి తరలించాలంటే ప్రైవేటు అంబులెన్స్‌పై ఆధారపడాల్సి వస్తోంది. ఇది పేద కుటుంబాలకు తలకుమించిన ఆర్థిక భారంగా మారుతోంది. నియోజకవర్గం మొత్తమ్మీద ఒక్క 108 అంబులెన్స్ కూడా లేదు. రోడ్డు ప్రమాదాలు, ఘర్షణలు జరిగినప్పుడు, హృద్రోగులు, స్త్రీల ప్రసవ సమయం వంటి అత్యవసర పరిస్థితుల్లో సేవలందించే దిక్కు కూడా లేదు. ప్రైవేటు వాహనాల్లో మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు చేరినప్పటికీ ప్రయోజనం ఉండడం లేదు. ఇక్కడ మెరుగైన వైద్య సేవలు లేకపోవడంతో అత్యవసర సమయంలో క్షతగాత్రులను నరసరావు పేట, గుంటూ రులకు తరలించడానికి 108 అంబులెన్స్ అందుబాటులో లేదు. ఇదే అదునుగా ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకులు రూ.వేలల్లో వసూలు చేస్తున్నారు. గతంలో మాచర్ల ప్రభుత్వ వైద్యశాల పరిధిలో రెండు, మండలానికి ఒకటి చొప్పున అంబులెన్స్‌లు ఉండేవి. అయితే ఆరు నెలలుగా అంబులెన్స్‌లు జాడ కనిపించడం లేదు. పట్టణంలోని రెండు అంబులెన్స్‌లు ఆరు నెలలుగా మూలనపడ్డాయి. ఇప్పటికీ వాటికి మరమ్మతులు చేయించలేదు. మండలాల పరిధిలో అంబులెన్స్‌ల ఊసే లేదు. పేదల సంజీవనిగా పేరొందిన 108 అంబులెన్స్‌లు లేకపోవడంతో అత్యవసర సమయంలో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందని ప్రజలు కన్నీరుమున్నీరవుతున్నారు.



మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాల



మూలనపడిన 108 అంబులెన్స్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



108 అంబులెన్స్‌లు లేకపోవడంతో అత్యవసర సమయంలో సరైన సమయానికి చికిత్స అందక క్షతగాత్రులు ఇబ్బందులు పడుతున్నారు. అంబులెన్స్‌ల కొరతపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- కేపీ చారి, సూపరింటెండెంట్



నాగార్జున సాగర్ క్రస్ట్‌గేట్లు మూసివేత

విజయపురిసౌత్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లను మూసివేశారు. సాగర్ జలాశయం నీటిమట్టం బుధవారం నాటికి 586.10 అడుగులుగా ఉంది. ఇది 300.83 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,000 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5654 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 34,307, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు మొత్తంగా 52,661 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో గా 52,661 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పశ్చిమడెల్టాకు 6,830 క్యూసెక్కులనీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 6,830 క్యూసెక్కుల నీరు బుధవారం విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 60,150 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 296 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 1,748 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 598 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 204 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 200 క్యూసెక్కులు, కొమ్మ మూరు కాల్వకు 3320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

టెయిల్‌పాండ్‌లో రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి

❖ పులిచింతలకు 34,118 క్యూసెక్కుల నీరు విడుదల

రెంటచింతల,సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ ప్రాజెక్టులో మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 0.177 ఎంయూ (మిలియన్ యూనిట్)ల విద్యుత్‌ను తయారు చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 3 గేట్లను 1.5 మీటర్లు, 1 గేట్‌ను 1 మీటర్ మేర ఎత్తి 25,492 క్యూసెక్కులు, విద్యుత్ తయారీ అనంతరం టేల్‌రేస్ ఛానల్ ద్వారా 8,626 క్యూసెక్కులు మొత్తంగా 34,118 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 40.02 టియంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుండి 36వేల 172 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 1700 క్యూసెక్కుల నీరు లీకుల ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం 2100 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 639 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9600, గరిష్ఠ ధర రూ.10,851, మోడల్‌ధర రూ.10,485 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,600, గరిష్ఠ ధర రూ.10,650, మోడల్‌ధర రూ.10250 పలికాయి.

తగ్గుముఖం పట్టిన వరద

● ఊపిరిపీల్చుకుంటున్న తీరప్రాంత ప్రజలు




వరద ఉధృతి తగ్గటంతో బయటపడ్డ పెనుమూడి పుష్కరఘాట్ మెట్లు

రేపల్లె, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి వరద ఉధృతి తగ్గటంతో తీరప్రాంత ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు వరదనీరు క్రమేపీ తగ్గటంతో మండలంలోని పెనుమూడి కృష్ణానదికి వరద ఉధృతి తగ్గి పుష్కరఘాట్ మెట్లు బయటపడ్డాయి. వరద ఉధృతి తగ్గటంతో కృష్ణాకరకట్ట పరిసరప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. భట్టిప్రోలు మండలం లంకగ్రామాలైన పెసర్లంకకు వెళ్ళే చిన్నరేవుల్లో వరదనీరు ఇంకా పూర్తిగా తగ్గలేదు. రాకపోకలు నిలిచిపోయి ఉన్నాయి. వాణిజ్యపంటల్లో చేరిన వరదనీరు బయటకు వెళ్ళటంతో రైతులు కొంత ఉపశయనం పొందారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద శాంతించిన కృష్ణమ్మ

● దిగువకు 36,250 క్యూసెక్కుల నీటి విడుదల

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల తగ్గడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణమ్మ శాంతించింది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి 52,591 క్యూసెక్కుల వరదనీరు బుధవారం ఇన్‌ఫ్లోగా నమోదయినట్లు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం నమోదవగా దిగువకు 36,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. తూర్పు డెల్టా కాలువ కు 9,236 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7,105 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు ఛానల్‌కు నీటి విడుదలను నిలిపివేసినట్లు రాజేశ్ తెలిపారు.



దిగువకు విడుదలవుతున్న కృష్ణానది వరద నీరు

పిడుగురాళ్ల షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలం

● గుంటూరు జడ్పీ సీఈవో జ్యోతిబసు ● నకరికల్లు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

నకరికల్లు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న పిడుగురాళ్ల షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలం వేయనున్నట్లు జడ్పీ సీఈవో వీ జ్యోతిబసు తెలిపారు. మూడేళ్ల కాల పరిమితి ముగియడంతో ఈ వేలం నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. నకరికల్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ జనరల్ ఫండ్, జిల్లా పరిషత్ జనరల్ ఫండ్, 15 ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం వినియోగించారా లేదా అనే అంశాలను పరిశీలించారు. పంచాయతీరాజ్ రికార్డులను, రిజిస్టర్లను, బిల్లులను అన్నింటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రోడ్ల నిర్మాణం కోసం జిల్లా పరిషత్తు నిధులను రూ.22 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. తాగునీటి పథకాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.31 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి ఆదర్శ యోజన పథకం కింద షెడ్యూల్ కులాల అత్యధిక జనాభా కలిగిన 9 గ్రామ పంచాయతీలకు ఒక్కో పంచాయితీకి రూ. 20 లక్షలు చొప్పున రూ.1.80 కోట్లు కేటాయించినట్లు వివరించారు. రెండో విడతలో భాగంగా గ్రామ అభివృద్ధి పథకంలో ఎంపీడీవోల ప్రతిపాదనల ఆధారంగా కేటాయింపులు చేస్తామని తెలిపారు. ఈ నిధులను సీసీ రోడ్లు, డ్రైనేజీల, కమ్యూనిటీ భవనాల నిర్మాణం కోసం వెచ్చించనున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ పనుల ద్వారా చేపట్టే మెటీరియల్ బిల్లులకు మ్యాచింగ్ గ్రాంట్ సమకూరుస్తున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ ఉద్యోగుల పదోన్నతుల్లో భాగంగా ఈపూరు, క్రోసూరు, పెదకూరపాడు, దాచేపల్లి, దుర్గి, కారంపూడి, రెంటచింతల, నగరం, రేపల్లె, తాడేపల్లికి ఎంపీడీవోలను నియమించనున్నట్లు తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో నియామక ఉత్తర్వులను జారీ చేస్తామని జ్యోతిబసు స్పష్టం చేశారు. నకరికల్లుతో పాటు నరసరావుపేట, ఫిరంగిపురం మండలాల రికార్డులను పరిశీలించినట్లు ఆయన వెల్లడించారు.



నకరికల్లులో మాట్లాడుతున్న గుంటూరు జడ్పీ సీఈఓ జ్యోతిబసు

రౌడీషీటర్లపై పోలీసుల ఉక్కుపాదం

● డీజీపీ ఆదేశాలతో స్టేషన్‌ల వారీగా వివరాల సేకరణ

సత్తెనపల్లి సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపేలా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. సత్తెనపల్లి సబ్‌డివిజన్‌లో పోలీసుస్టేషన్‌ల వారీగా రౌడీషీటర్లు ఎంతమంది ఉన్నారు, వారు ఇంకా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారా నాయకులతో అంటకాగుతూ సెటిల్‌మెంట్లు చేస్తున్నారా అనే దిశగా వారు వివరాలు సేకరిస్తున్నారు. పదేపదే నేరాలు చేస్తున్న రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ తాజాగా డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాలు ఇవ్వడంతో పోలీసు అధికారులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. రౌడీషీటర్లు ఎంతమంది క్రియాశీలకంగా ఉన్నారు, వారంతా ఎక్కడెక్కడ తిరుగుతున్నారు, రాజకీయ నాయకుల కనుసన్నల్లో మెదులుతున్నవారెందరు అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఏడాది కాలంలో రౌడీషీటర్లు ఏమైనా గొడవలలో పాల్గొన్నారా అనే అంశాలను కూడా పరిశీలిస్తున్నారు. పాత రికార్డులను తిరగదోడి గతంలో రౌడీషీటర్లుగా నమోదైనవారిపై పూర్తిస్థాయి నిఘా ఉంచారు. వారిని ప్రతివారం స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపుతున్నారు. నేర చరిత్ర ఉన్న వారిని జైలుకు పంపుతున్నారు. ఇందులో భాగంగా సత్తెనపల్లిలో నేర చరిత్ర కలిగిన ఇద్దరు యువకులను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసులు రాజమండ్రి జైలుకు తరలించారు.

ఆంధ్రా జాలర్లపై తెలంగాణ జాలర్ల దాడి

రెంటచింతల,సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని టెయిల్‌పాండ్ ప్రాజెక్టు రాళ్లగుట్ట వద్ద చేపలు పట్టడానికి వచ్చిన ఆంధ్రా జాలర్లపై తెలంగాణకు చెందిన వారు దాడి చేసి దుర్భాషలాడారు. విజయపురిసౌత్‌కు చెందిన ఆంధ్రా జాలర్లు వలలు వేసి చేపలు పడుతున్న సమయంలో ఆవలి ఒడ్డున ఉన్న తెలంగాణకు చెందిన పలువురు జాలర్లు నది దగ్గరకు చేరుకుని చేపలు పట్టే హక్కులేదని వాదనకు దిగారు. మాటా మాటా పెరగడంతో పాటు తెలంగాణకు చెందిన 15 మంది వ్యక్తులు విచక్షణారహితంగా ఆంధ్రాజాలర్లపై దాడి చేశారు. ఇక్కడ మీరు చేపలు పట్టడానికి వీల్లేదంటూ ఛీంకరించారు. మరోసారి వస్తే వేరే విధంగా ఉంటుందంటూ చిందులు వేశారు. వలలను నదిలో వేయడానికి ప్రయత్నించగా ఆంధ్రా జాలర్లంతా అడ్డుకున్నారు. ఈ మేరకు స్థానిక స్టేషన్లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు దృష్టికి వెళ్లడంతో ఆయన ఆర్డీవో మురళీ కృష్ణ, తహసీల్దార్ మేరీ కనకంతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మత్స్యకార సంఘ నేత గంగరాజు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు.

గురజాల, పిడుగురాళ్ల రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలి

● జడ్ఆర్‌యూసీసీ

పిడుగురాళ్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ప్రయాణికులకు ఎంతో వీలుగా ఉన్న మాచర్ల మెమో రైలుకు బోగీలు పెంచడంతో పాటు గురజాల, పిడుగురాళ్ల రైల్వేస్టేషన్లను మరింత అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు (జడ్ఆర్‌యూసీసీ) కొంకా రాధ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన దక్షిణ మధ్య రైల్వే 76వ జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో రాధ పాల్గొని పల్నాడు ప్రాంతం మీదుగా వెళ్లే రైళ్ల నిలుపుదల, స్టేషన్ల అభివృద్ధి గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

కార్యకర్తలు చేజారిపోతున్నారనే కాసు రెచ్చగొట్టే వ్యాఖ్యలు

● కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక కక్షసాధింపులు లేవు
● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక గురజాల అభివృద్ధికే తాను పనిచేస్తున్నానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. నాడు అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నేతలు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ అనేక గ్రామాలలో కూటమి నేతలపై అక్రమ కేసులు, మహిళలపై అత్యాచారాలతో పాటు మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేశారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదట్లోనే అనేక సభలలో కక్ష సాధింపులు ఉండవని, ఎవరికి ఇష్టమైన పార్టీలో వారు కొనసాగవచ్చని హామీ ఇచ్చిందని చెప్పారు. చేతనైతే తమతో కలిసి వచ్చి గ్రామాలను అభివృద్ధి చేయాలి కాని అనవసరమైన గొడవలకు పోయి జీవితాలు పాడు చేసుకోవద్దని పలుమార్లు బహిరంగంగా తాను చెప్పానని యరపతినేని గుర్తుచేశారు. కాసు మహేష్‌రెడ్డి కార్యకర్తలను కాపాడుకునేందుకు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ వారిని కేసుల్లో ఇరికించి తనచుట్టూ తిప్పుకునే విధంగా చేస్తున్నారని ఆరోపించారు. దానిని వైసీపీ నేతలు, కార్యకర్తలు గమనించాలని అన్నారు. వైసీపీ నేతల ప్రసంగాలను, రెచ్చగొట్టే వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో వారు ఒక సీటుకే పరిమితం అవుతారేమోనని అనుమానంగా ఉందని ఎమ్మెల్యే యరపతినేని పేర్కొన్నారు.

కాసు మాటలు అహంకారానికి నిదర్శనం

● పల్నాడులోని పలు స్టేషన్లలో ఆయనపై కూటమి నేతల ఫిర్యాదు

దాచేపల్లి/పిడుగురాళ్ల/గురజాలటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వస్తే కత్తులు, గొడ్డళ్లతో సమాధానం చెబుతామంటూ రెచ్చగొడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాటలు ఆయన అహంకారానికి నిదర్శనమని కూటమి నేతలు ఆరోపించారు. బుధవారం దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం, గురజాల పోలీస్ స్టేషన్‌లలో కాసు మహేష్‌రెడ్డిపై ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ కాసు మహేష్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. పిడుగురాళ్ల పట్టణంలో జరిగిన స్త్రీశక్తి విజయోత్సవ సభకు విశేషంగా మహిళలు వచ్చి విజయవంతం చేయడం, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ పథకాలతోపాటు అభివృద్ధి చేపడుతూ ముందుకు నడుస్తున్న కూటమి ప్రభుత్వం ఆదరణను జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు వస్తున్న ప్రజాదరణ చూసి మహేష్‌రెడ్డి పిచ్చెక్కినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వంలో 11 మంది టీడీపీ కార్యకర్తలు హత్యలకు గురయ్యారని, 8 మంది చిన్నారులు అక్రమంగా మైనింగ్ చేసిన క్వారీలో పడి చనిపోయారని ఆరోపించారు. 80 మంది కాళ్లు, చేతులు విరగొట్టారని, మహిళలపై అత్యాచారాలు జరిపారని, పలువురి ఆస్తులను ఆక్రమించుకున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో వ్యాపారస్తులు, రైతాంగం, ఉద్యోగస్తులు, మహిళలు ప్రశాంతంగా ఉంటే మరలా ఓడిపోతామనే భయంతో కాసు గొడ్డళ్లు, కర్రలు పేరుతో ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. 2029లోనూ ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, కాసు నోరు అదుపులో ఉంచుకోవాలని హెచ్చరించారు.



మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై దాచేపల్లి పోలీస్‌స్టేషన్లో సీఐ భాస్కరరావుకు ఫిర్యాదు చేస్తున్న కూటమి నేతలు

మందుల అక్రమ వ్యాపారికి మూడేళ్ల జైలు శిక్ష, జరిమాన

గుంటూరు మెడికల్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మందులను దొంగిలించి వాటి పేర్లు, స్టిక్కర్లు మార్చి అక్రమంగా విక్రయిస్తున్న నిందితుడికి కోర్టు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. తెనాలికి చెందిన దేసు నాగేశ్వరావు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వ ఈఎస్ఐ ఆసుపత్రులకు చెందిన 53 రకాల మందులతోపాటు మొత్తం 67 రకాల మందులను అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తుండగా ఔషధ నియంత్రణశాఖ అధికారులు దాడి చేసి వాటిని స్వాధీనం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. అందులో కొన్ని మందులకు గడువుతేదీ దాటడంతో వాటిపై స్టిక్కర్లు తొలగించి కొత్తవి అంటించినట్లు గుర్తించారు. క్యూర్‌టెక్ ఫార్ములేషన్ లిమిటెడ్ ద్వారా తయారైనట్లు చెప్పిన నకిలీ ఎఫ్ఐఎక్స్ 200 మందులను కూడా అతడు నిల్వ చేసి విక్రయించినట్లు అధికారులు కనుగొన్నారు. దేసు నాగేశ్వరరావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా విచారించిన అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వీఏఎల్ సత్యవతి నాగేశ్వరరావు తప్పు రుజువు కావడంతో అతడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఆంధ్రా నుంచి తెలంగాణకు అక్రమంగా యూరియా తరలింపు

● పోలీసుల అదుపులో నిందితులు

దాచేపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా నుంచి తెలంగాణకు ఆటోలో అక్రమంగా తరలిపోతున్న యూరియాను పొందుగల చెక్‌పోస్టు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యూరియా ఉన్న ఆటోను సీజ్ చేసి నిందితులను అరెస్టు చేశారు. దాచేపల్లి ఎస్సై సౌందర్ రాజన్ వివరాల ప్రకారం, దాచేపల్లి మండల పరిధిలోని పొందుగల గ్రామం వద్దనున్న రాష్ట్ర పోలీసు చెక్ పోస్టు వద్ద అధికారులు సాధారణ తనిఖీలు చేస్తుండగా యూరియా కట్టల లోడుతో ఉన్న ఆటో వారి కంటబడింది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆటోలోని 14 యూరియా కట్టలను స్వాధీన పరుచుకొని, యూరియాను తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఎటువంటి అనుమతుల్లేకుండా యూరియా కట్టలను తరలిస్తున్న ఓ ఉద్యోగిపై కూడా అధికారులు విచారణ జరుపుతున్నారు. ఇప్పటికే అధికారులు పూర్తిస్థాయిలో యూరియా కట్టల నిల్వలున్నాయని చెబుతున్నప్పటికీ తెలంగాణకు చెందిన కొంత మంది వ్యక్తులు ఆంధ్రా రైతుల ఆధార్ కార్డులు, పాస్ పుస్తకాల జిరాక్స్‌లు చూపుతూ యూరియా కట్టలను తరలించే ప్రయత్నం చేస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి దీని వెనుక ఉన్న వ్యక్తులను గుర్తిస్తామని అధికారులు తెలిపారు.

ఏఎన్‌యూలో రూసా హబ్ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఉపకులపతి ఆచార్య గంగాధరరావు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రూసా 2.0 కింద రూసా హబ్ కేంద్రంతో పాటు రీసెర్చ్ ఇన్నోవేషన్ కేంద్రం భవన నిర్మాణానికి బుధవారం ఉపకులపతి ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం భూమి పూజ చేశారు. రూసా నిధుల కింద సుమారు రూ.4 కోట్లతో ఈ నిర్మాణం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రూసా సమన్వయకర్త ఆచార్య మురళీమోహన్, ఆర్ట్స్, సైన్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆచార్య సురేష్ కుమార్, ఆచార్య వీరయ్య, దూరవిద్యా కేంద్రం సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు, సమన్వయకర్త ఆచార్య రామచంద్రన్, సీడీసీ డీన్ ఆచార్య రవికుమార్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య లింగరాజు, ఓఎస్డీ ఆచార్య రవికుమార్, యూజీ పరీక్షల సమన్వయకర్త కృష్ణారావు, విదేశీ విద్యార్థుల కేంద్రం సమన్వయకర్త పద్మావతి పాల్గొన్నారు.

వెదురుకు.. ఊతం

(5వ పేజీ తరువాయి)

వద్ద లభ్యమయ్యే తక్కువ వనరులను ఉపయోగించి స్థిరమైన ఆదాయాన్ని పొందడంలో వెదురు ప్రథమ స్థానంలో నిలుస్తోంది. వెదురు సాగులో బాంబుసా తుల్డా, బాంబుసా బర్మానిక, నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు డెన్డ్రో కేలామస్ స్ట్రిక్టస్ అనే రకాలు అనుకూలంగా ఉన్నాయి.

పర్యావరణ హితం..

బీడు భూములను సస్య శ్యామలం చేయడంలో కీలకపాత్ర పోషిస్తుంది. వెదురు అధిక ఆమ్లకర్బనాన్ని గ్రహించి, గాలిలో ఆక్సిజన్ విడుదల చేస్తాయి. దీంతో వాయు కాలుష్యం తగ్గుతుంది. వర్షపు నీటిని నేలలోకి చొప్పించి భూగర్భ జలాలను నింపుతాయి. గుబురు వేరు వ్యవస్థ కారణంగా నేలకోత నివారణలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. వెదురు వనం సృష్టించడం ద్వారా పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయవచ్చు.

ప్రోత్సాహం ఇలా..

ఉద్యాన తోటల సరిహద్దులో, బీడు భూముల్లో నాటే వెదురుకు హెక్టారుకు రూ.60,000 వరకు రాయితీని ప్రభుత్వం అందిస్తోంది. మొదటి ఏడాది గుంతలు తీసుకోవడానికి రూ.3000, మొక్కలకు రూ.6250, ఎరువుల కోసం రూ.7,850, మొక్కలు నాటుటకు, మొక్క ఊతానికి రూ.2,900, అంతర సేద్యానికి రూ.8,500, కలుపు, నీటి యాజమాన్యం కోసం రూ.7500 ఇలా మొత్తం రూ.36,000 అందిస్తుంది. రెండో సంవత్సరంలో ఎరువులకు రూ.10,000 అంతర సేద్యానికి రూ.7000, కలుపు, నీటి యజమాన్యానికి రూ.7000 వెరసి రూ.24000 లను అందుతుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

'గుర్రం జాషువా పల్నాడు జిల్లాగా మార్చాలి'

కారంపూడి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పేరును గుర్రం జాషువా పల్నాడు జిల్లాగా మార్చాలని ప్రజా సంఘాల నేతలు కోరారు. బుధవారం స్థానిక వీరుల గుడి వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జాషువా తన రచనలతో సమాజంలో అంటరానితనం నిర్మూలనకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సీనియర్ నేత వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, ఎంసీపీఐ రాష్ట్ర నేత అబ్రహంలింకన్, గిరిజన సంఘ రాష్ట్ర నేత వీ కోటానాయక్, పౌరహక్కుల సంఘ నేత వినుకొండ పేరయ్య, మస్తాన్‌వలి, అన్నపూర్ణ, ఉన్నం రాణి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి శిక్షణ ప్రారంభం

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళ, బాలికల స్నేహపూర్వక గ్రామ పంచాయతీల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో బుధవారం ప్రారంభమైంది. మండలంలోని నందిగామ, గురజాల మండలంలోని దైద, దాచేపల్లి మండలం కొత్తూరు, గామాలపాడు, యడ్లపాడు మండ లం దింతెనపాడు గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు మహిళాశిశు సంరక్షణ కార్యదర్శులు, సంక్షేమవిద్య కార్యదర్శులు వీఆర్వో లు, ఏఎన్ఎంలు శిక్షణలో పాల్గొన్నారు. వీరికి ఐక్య రాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, మహిళ, బాలికల స్నేహపూర్వక గ్రామ పంచాయతీలపై దృష్టిసారించ వలసిన అంశాలు ఆరోగ్యం, పోషణ, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక అవకాశాల బాధ్యత తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణకు మాష్టర్ ఆఫ్ ట్రైనర్‌లుగా పంచాయతీ కార్యదర్శి కుంబా వెంకటేశ్వర్లు, చిలువూరి కృష్ణప్రసాద్, వ్యవహరించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో రాజగోపాల్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎండ్రాయి గ్రామానికి చెందిన యల్లా శ్రీనివాసరావు (55) గుంటూరులోని వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. సోమవారం లేమల్లె గ్రామానికి వెళ్లి ఎండ్రాయి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై నుంచి కిందపడ్డాడు. దీంతో శ్రీనివాసరావు తలకు బలమైన గాయం కాగా వెంటనే గుంటూరులోని వైద్యశాలకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. శ్రీనివాసరావుకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

6న సత్రశాల ట్రస్ట్‌బోర్డు సభ్యుల పదవీ స్వీకారోత్సవం

రెంటచింతల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పల్నాట ప్రముఖ శైవక్షేత్రం కృష్ణా నది ఒడ్డున గల సత్రశాలలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ అబ్బిరెడ్డి చెప్పా రు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి హాజరవుతారన్నారు. పార్టీ నేతలు, శివయ్య భక్తులు తరలిరావాలని ఆయన కోరారు. సమావేశంలో ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి, టీడీపీ సీనియర్ నేతలు ప్రభురాజు యాదవ్, సుమంత్‌రెడ్డి, బోడపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకుంటున్న కిడ్స్ పాఠశాల ఉపాధ్యాయుడు

కిడ్స్ పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం

మాచర్ల టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు విద్యానగర్‌లోని హర్ష ఐటీ మెడికల్ అకాడమిలో బుధవారం ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్ యూనియన్ టీచర్స్ వేడుకలు జరిపారు. మాచర్ల పట్టణంలోని కేసీపీ యాజమాన్యం నిర్వహించే కిడ్స్ పాఠశాల ఉపాధ్యాయులైన పవన్‌కుమార్ (ఫిజికల్ సైన్స్), సీహెచ్ ఆనందరావు (సోషల్ సైన్స్ అడిస్టెంట్)లను పీటీఎల్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జి, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణలు సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణశాస్త్రి, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గురజాల టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిపాడు, దైద సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రసాద్ తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించనున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు మిఠాయిల పంపిణీ

పెదకూరపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో కంచర్ల ఐజక్ వర్ధంతిని పురస్కరించుకుని విద్యార్థులకు ఐజక్ కుటుంబసభ్యులు రాజ్యలక్ష్మి, ప్రదీప్ మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో రాయపూడి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.



పొందుగల చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు

పొందుగల రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద అర్ధరాత్రి తనిఖీలు

దాచేపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి పొందుగల, తంగెడ రాష్ట్ర పోలీస్ చెక్ పోస్టుల వద్ద పల్నాడు జిల్లా వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు అర్ధరాత్రి తనిఖీలు చేపట్టారు. పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలతో చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీలు చేశారు. ఆంధ్రా నుంచి తెలంగాణకు అక్రమంగా యూరియా కట్టలు తరలిపోతున్నాయన్న ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. తనిఖీలలో డీఏవోఎం జగ్గారావు, ఏడీఏలు హనుమంతరావు శ్రీకృష్ణదేవరాయలు జగదీశ్వరరెడ్డి ఏవోలు కే.వెంకటేష్, పుల్లారెడ్డి, దాచేపల్లి తహసీల్దార్ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ సీనియర్ అసిస్టెంట్ వెంకట్రావు ఉన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే ప్రజలు క్షమించరు

కాసు వ్యాఖ్యలపై కూటమి నేతల ఆగ్రహం



మాచవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాచవరంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి రెచ్చగొట్టే విధంగా మాట్లాడటాన్ని ప్రజలు క్షమించరని కూటమి నేతలు ఆగ్ర హించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కూటమినేతలు విలేకర్ల సమావేశం నిర్వహించారు. అధికారంలోకి వచ్చాక గొడ్డళ్లతో వెంటాడతాం.. అంటూ కార్యకర్తలను రెచ్చగొట్టి గ్రామాల్లో గొడవలు సృష్టించడానికి కాసు మహేష్‌రెడ్డి ప్రణాళికలు చేస్తున్నారన్నారు. సోమవారం పిడుగురాళ్లలో శ్రీశక్తి విజయోత్సవ సభ సక్సెస్ కావడా న్ని కాసు మహేష్‌రెడ్డి ఓర్వలేక కార్యకర్తలను ఉసిగొల్పే విధంగా మాట్లాడుతున్నారని మార్కెట్ కమిటీ చైర్మన్ తురకా వీరస్వామి, మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకులు షేక్ బాబావలి తెలిపారు. అధికా రంలో వున్నప్పుడు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టించడం, పిన్నెల్లి, తురకపాలెం మరికొన్ని గ్రామాలలో మైనారిటీలపై దాడులు, మహిళలపై అత్యాచారాలకు పాల్పడటం వల్లనే ఆయా గ్రామాలలో మహిళలే తిరుగుబాటు చేసి కాసు మహేష్‌రెడ్డిని ఓడించేందుకు కంకణం కట్టుకున్నారని వడ్డవల్లి సర్వేశ్వరరావు, డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావు, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా, గండికోట వెంకటేశ్వర్లు తెలిపారు.

మహేష్‌రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలి

మాచవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని మాచవరం మండల టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈనెల 2వ తేదీన మాచవరంలో 'ఇప్పుడు కర్రలతో వస్తున్నాం.. అధికారంలోకి రాగానే గొడ్డళ్లతో వస్తామంటూ' కాసు మహేష్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ టీడీపీ నేతలు విలేకరులతో మాట్లాడారు. కాసు మహేష్‌రెడ్డి స్తబ్ధతగా ఉన్న వైసీపీ నేతలు, కార్యకర్తలను రెచ్చగొట్టేలా మాట్లాడడం సరైంది కాదని హెచ్చరించారు. ఒకవేళ మీరు రెచ్చగొట్టినా వైసీపీ నేతలు, కార్యకర్తలు రెచ్చిపోయే పరిస్థితిలో లేరన్నారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచినప్పటికీ గ్రామాల్లో గొడవలు వద్దు అంటూ ప్రశాంత జీవనం గడపాలని తమ నేతలు, కార్యకర్తలను సముదాయిస్తున్నారని వారు పేర్కొన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి పల్నాడు ప్రాంతాన్ని ఫ్యాక్షన్ ఊబిలోకి లాగవద్దని సూచించారు. సమావేశంలో అన్ని గ్రామాల టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హింసకు తెరలేపుతున్న కాసు

గురజాలటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హింసకు తెరలేపుతున్నారని కూటమి నేతలు మండిపడ్డారు. మాచవరం మండలంలో ఓ సమావేశంలో మహేష్‌రెడ్డి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి నేతలను వీధుల వెంబడి గొడ్డళ్లతో నరుకుతాం అంటూ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం అరాచకాలు సృష్టించినందుకు 2024 ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఇంటికి పంపారని, అయినప్పటికీ వారికి సిగ్గు రావడం లేదని ఆగ్రహించారు. ఈ సమావేశంలో కూటమి నేతలు కె.అంకారావు, ఎ.శ్రీనివాసరావు, చాగంటి శ్రీను, కత్తి చలమరాజు, సుందరగిరి నజీమూన్, సి.దానయ్య తదితరులు పాల్గొన్నారు.



వేద కాలేజీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని వేద కాలేజీలో నర్సింగ్ విద్యార్థులకు బుధవారం క్యాప్‌ల బహూకరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మె ల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రోగులను కాపాడే నిజమైన దేవతలు నర్సులని అన్నారు. పల్నాడుజిల్లా ఇంటర్ విద్యా పర్యవేక్ష కురాలు లీలావతీదేవి ఉత్తీర్ణత సాదించిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. నర్సింగ్‌లో రాష్ట్రస్థాయిలో రెండో స్థానం పొందిన నాగ రాణికి ఎమ్మెల్యే కన్నా జ్ఞాపికను అందించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల నిర్వహకులు ప్రభావతి, సూర్యప్రకాశ్, ప్రిన్సి పాల్ సైదానాయక్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అనుపాలెం మాజీ సర్పంచ్‌కు కన్నా నివాళి

రాజుపాలెం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుపా లెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు గోగుల అంజయ్య (72) అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అంజయ్య టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ గ్రామ సర్పంచ్‌గా చేశాడు. నియోజకవర్గ, జిల్లా స్థాయి పదవులు అలంకరించి పార్టీ బలోపేతానికి కృషి చేశాడు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారా యణ అంజయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంజయ్య మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. నివాళులర్పించిన వారిలో గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పీవీ కోటయ్య, మండల అధ్యక్షుడు ఎ.నరసింహారావు, పి.పెద్దిరాజు, ఎస్.శ్రీనివాసరావు(వాసు), ఎ.ప్రభుదాసు, సి.రాఘవరావుయాదవ్ ఉన్నారు.

గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో మహిళ మృతదేహం



నకరికల్లు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో అడ్డరోడ్డు వద్ద మహిళ మృతదేహాన్ని బుధవారం స్థానికులు కనుగొన్నారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో మహిళ మృతదేహంను పోలీసులు బయటకు తీయించారు. మృతురాలు చీమలమర్రి గ్రామానికి చెందిన సురభి సీతమ్మగా పోలీసులు గుర్తించారు. మనస్థాపానికి గురైన సీతమ్మ కాలువలో పడినట్లు చెప్పారు.

విఘ్నేశ్వరునికి ఎమ్మెల్యే ప్రవీణ్ పూజలు



విప్పర్లలో వినాయకుడి విగ్రహానికి పూజా కార్యక్ర మాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పర్లలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ బుధవారం గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినాయకుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనను ఆశీర్వదించారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ కొండవీటి శ్రీనివాస రావు, టీడీపీ నాయకులు చెరుకూరి నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు మొగల్ జాన్, అచ్చంపేట మండల నాయకులు గంధ కోటేశ్వరరావు పలువురు నాయకులు పాల్గొన్నారు.

● అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సిద్ధిబుద్ధి సమేత విఘ్నేశ్వర స్వామి ఆలయంలో నవరాత్రి మహోత్సవాల్లో బుధవారం స్వామి కల్యాణం భక్తి శ్రద్ధలతో జరిగింది. కల్యాణాన్ని అలయ అర్చకులు ఉమాశంకర్ శర్మ వేదమంత్రోచ్ఛరణలతో మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ధండా సాంబశివ రావు, శివనాగమల్లేశ్వరరావు, శివయ్య, భక్తులు పాల్గొన్నారు.

● పెదకూరపాడు: పెదకూరపాడులోని మిట్ట సెంటర్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తులకు అన్నదానం

విజయపురిసౌత్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రులను పురస్కరించుకొని స్థానిక పాత విద్యుత్ కార్యాలయ రహదారి వద్ద నెలకొల్పిన వినాయకుడి విగ్రహం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. అర్చకుడు హనుమంతాచార్యులు ఆధ్వర్యాన స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం లడ్డూ ప్రసాదం వేలం నిర్వహించి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. అలాగే శ్రీసీతారామాలయం, సాగర్ క్యాంపులో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కొమర రామారావు, లక్ష్మీ, రంగస్వామి, వెంకటేశ్వరరావు, పులుసు వీరారెడ్డి, దామరవరపు మురళి, మోహన్, బొజ్జా ఆంజనేయులు, డాక్టర్ ఎస్‌కె సైదా, షేక్ బషీర్, గ్రంది అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపుదలకు కృషి చేయాలి

● జిల్లా పరిశీలకురాలు పద్మకోటి



క్రోసూరు హైస్కూల్లో విద్యార్థులకు సూచనలిస్తున్న జిల్లా పరిశీలకురాలు పద్మకోటి

క్రోసూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యం పెంపుదలకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డైట్ కాలేజీ నుంచి వచ్చిన జిల్లా పరిశీలకురాలు కే పద్మకోటి అన్నారు. బుధవారం క్రోసూరు జిల్లా పరిషత్ హైస్కూలును ఆమె సందర్శించారు. ఈ సం దర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. 6, 7, 8 తరగతి విద్యార్థుల సామర్థ్యాలను, నైపుణ్యాలను ఆమె పరిశీలిం చారు. విద్యార్థులకు కావలసిన అన్ని రకాల వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని, విద్యార్థులు చక్కగా చదువుకోవటం, క్రమశిక్షణతో మెలగడం వంటివి అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వాటి నిర్వహణకు ఉపాధ్యాయులకు తగిన సూచనలు ఇచ్చారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధా న ఉపాధ్యాయుడు దుర్గి బాబురావు, సీనియర్ ఉపాధ్యాయులు చిల్కా సురేష్, ఎంఈవో-2 గణేష్ పాల్గొన్నారు.

గుంతలు తీసి పండ్ల మొక్కలు నాటాలి: ఏపీవో ప్రసాదు

నకరికల్లు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలకు అనుమతి పొందిన రైతులు గుంతలు తీసి మొక్కలు నాటాలని ఏపీవో ప్రసాదు కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రసాదు మాట్లాడుతూ జామ, మామిడి, బత్తాయి తోటలు సాగు చేశారని 40 ఎకరాలు లక్ష్యం కాగా 36 ఎకరాలకు పరిపాలనా పరమైన ఆమోదం లభించిందన్నారు. జిల్లాపేట పంచాయతీలో గిరిజనులు 20 ఎకరాలలో పండ్ల తోటలు సాగు చేస్తున్నారన్నారు. సమావేశంలో టీఎఫ్ టీ సునీత, మణికంఠ, సైదమ్మలు పాల్గొన్నారు.

పత్తిలో అంతర పద్ధతి పాటించాలి: డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి

మాచవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటలో దగ్గర, అంతరం పద్ధతి పాటించడం వల్ల ఎకరానికి 14వేల మొక్కలు వేసుకోవచ్చని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని మోర్జంపాడులో పత్తిలో దగ్గర అంతరం పద్ధతిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏవో రామమ్మ తదితరులు పాల్గొన్నారు.

● పెదకూరపాడు: రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని ఏవో కృష్ణయ్య అన్నారు. బుధవారం మండలంలోని 75త్యాళ్లూరులో పొలం పిలుస్తుంది కార్యక్ర మం నిర్వహించి రైతులకు సూచనలు అందజేశారు.

● క్రోసూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటలో ప్రస్తుతం తెగుళ్ల ఆశిస్తున్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో వి. వేణుగోపాల్ అన్నారు. బుధవారం ఊటుకూరు, విప్పర్ల గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పత్తి పంటలను పరిశీలించారు. ఈ క్రాప్ నమోదు గడువు ఈ నెల 30వ తేదీ వరకు ఉందన్నారు.

రైతులు పంట నమోదు చేయించుకోవాలి: ఏడీఏ

అచ్చంపేట సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులు రైతుసేవా కేంద్రంలో పంట నమోదు చేయించుకోవాలని ఏడీఏ మస్తానమ్మ అన్నారు. బుధవారం వేల్పూరు సొసైటీ కార్యాలయంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఎరువుల పంపిణీ గోదామును పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో వెంకటేశ్వర్లు, సొసై టీ అధ్యక్షులు డి.రామారావు, డైరెక్టర్ కె.లక్ష్మణ్ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



అనన్యకు ప్రోత్సాహక నగదు అంద జేస్తున్న అతిథులు

అవరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ధరణికోటలో విఘ్నేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న నవరాత్రి మహో త్సవాల్లో దేవస్థాన సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో గత విద్యా సంవ త్సరంలో పదోతరగతి, ఇంటర్, మెడిసిన్‌లో ప్రతిభ చూపిన విద్యార్థు లకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, వికాస్ విద్యాసంస్థల అధిప తులు శంకరరావు, సుఖదేవ్, విశ్రాంత అధ్యాపకులు నూతలపాటి తిరుపతయ్య, వావిలాల సుబ్బారావు, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ జైనాబ్ జహా, కార్యక్రమ నిర్వాహకులు దండా సాంబశివరావులు పాల్గొని విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపికలను అందజే శారు. ఎంబీబీఎస్‌లో సీట్ సాధించిన వంకాయలపాటి అనన్యకు లక్ష రూపాయల నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మన డబ్బులకు మనవే లెక్కలు: ఎంపీడీవో శ్రీనివాసరావు

రెంటచింతల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబనకు కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడానికి రుణాల చెల్లింపులో అవకతవకలకు అడ్డుకట్ట వేయడానికి మొబైల్ బుక్ కీపింగ్ 2.0ను అందుబాటులోకి తెచ్చిందని ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో రూ.10 లక్షలతో గతంలోనే నిర్మించిన మండల సమాఖ్య భవనాన్ని ఎంపీడీవోతో పాటు వెలుగు ఏపీఎం కృపవేణి, టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీకి చెందిన సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, ప్రభురాజు, వెలుగు సీసీలు దాసు, వీరకుమారి, వీవోఏలు, మండల, గ్రామ సమాఖ్య ప్రతినిధులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, ఏపీవో వెంకటేశ్వర్లు యాదవ్‌లు పాల్గొన్నారు.



డీఈతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

రహదారులకు మరమ్మతులు చేపట్టాలి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వచ్చిన వరద లకు నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారులను పరిశీలించి మరమ్మ తులు నిర్వహించాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆర్‌అండ్‌బీ అధికారు లను ఆదేశించారు. బుధవారం గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయం లో ఆర్‌అండ్‌బీ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో డీఈ వెంకటకృష్ణారెడ్డికి తెలియజేశారు. శిథిలావస్థకు చేరిన భవనాల ను పరిశీలించి పునర్నిర్మాణానికి అవసరమైన అంచనాలను తయారు చేసి ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. రోడ్ల మరమ్మతులపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు.

హెచ్‌పీ పెట్రోల్ బంకు ప్రారంభం

క్రోసూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): క్రోసూరులో హిందుస్థాన్ పెట్రోలియం బంకును బుధవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రారంభించారు. ఆయనతో పాటు పెట్రోల్ బంకు ఓనర్ మహమ్మద్ షరీఫ్, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి వేగుంటరాణి, మండల అధ్యక్షుడు మొగల్ జాన్, నాయకులు బండారు మైసూర్‌బాబు, మార్కెట్ యార్డు డైరెక్టర్ దుద్దుల యోహాన్, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ బెల్లంకొండ రామ్ గోపాలరావు, మన్యం శీను, నల్లజాల కోటి తదితరులు పాల్గొన్నారు.



పులిచింతల పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గాయత్రీ దేవి, తహసీల్దార్ సరోజ

ఆక్రమణలను గుర్తించేందుకు టీమ్‌ను ఏర్పాటు చేస్తాం

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గాయత్రీ దేవి

రాజుపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజుపాలెంలోని పులిచింతల పునరావాస కేంద్రంలో ఆక్రమణలను గుర్తించేందుకు టీమ్‌ను ఏర్పాటు చేస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గాయత్రీదేవి చెప్పారు. గ్రీవెన్స్‌లో పునరావాస కేంద్రానికి చెందిన వారు ఖాళీ స్థలాలను ఆక్రమించుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపేందుకు బుధవారం పునరావాస కేంద్రానికి వచ్చి ఆక్రమణలను పరిశీలించారు. నిర్వాసితులు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవటంతో గాయత్రీదేవి రహదారుల్లోని ఆక్రమణలను గుర్తించారు. ఎక్కువ సంఖ్యలో ఆక్రమణలు ఉండటంతో పూర్తిస్థాయిలో గుర్తించేందుకు టీమ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. వారు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆమె వెంట తహసీల్దార్ సరోజ, వీఆర్వో నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న శ్రీనివాసరెడ్డి

రాష్ట్రస్థాయి జూనియర్ క్రికెట్ పోటీలు ప్రారంభం

విజయపురిసౌత్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలంలోని అలుగురాజుపల్లి సమీపంలోని న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం రాష్ట్రస్థాయి జూనియర్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను కళాశాల సెక్రటరీ జున్నా శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో 40 జట్లు పాల్గొననున్నట్లు చెప్పారు. బుధవారం 10 జట్లకు పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పోటీలను కళాశాల డైరెక్టర్ జున్నా పద్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరెడ్డిలు పోటీలను పర్యవేక్షించారు.

మున్సిపాలిటీ వద్దు.. పంచాయతీనే ముద్దు

● ప్లకార్డులతో భీమవరం గ్రామస్థుల నిరసన



ప్లకార్డులు చేతబూని నిరసన తెలియ జేస్తున్న మహిళలు, గ్రామస్థులు

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీమవరం గ్రామస్థులు బుధవారం గ్రామ సచివాలయం వద్ద నిరసన చేపట్టారు. తమ గ్రామాన్ని సత్తెనపల్లి మున్సిపాలిటీలో విలీనం చేయవద్దంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తామంతా సన్న, చిన్నకారు రైతులమని వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తామన్నారు. గ్రా మాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయడం వల్ల తాము ఉపాధి కోల్పో తామన్నారు. కొందరు గ్రామస్థులు సచివాలయం భవనంపైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. మున్సిపాలిటీ వద్దు పంచాయతీనే ముద్దు అంటూ ప్లకార్డులు చేతబూని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం సచివాలయంలో అందజేశారు. నిరసన కార్యక్రమంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆత్మకూరు ఎస్సీ కాలనీని సందర్శించిన అధికారులు



ఎస్సీ కాలనీ వాసులతో మాట్లాడుతున్న అధికారులు

దుర్గి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూరు ఎస్సీ కాలనీని బుధవారం మండల అధికారులు సందర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గతంలో ఎస్సీకాలనీ వాసులకు గృహాలతోపాటు వారు జీవించేందుకు సౌకర్యాలు కల్పించాలనే ఆదేశాలతో ఇటీవల జాయింట్ కలెక్టర్ సూరజ్ ఎస్సీ కాలనీని సందర్శించి కాలనీ వాసులు అవసరాలను తెలుసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం అధికారులు కాలనీకి చేరుకొని కాలనీ వాసులతో మాట్లాడారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏవో శివప్రసాద్, విద్యుత్ శాఖ ఏఈ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కారంపూడిలో 'అక్షరాంధ్ర - ఉల్లాస్ 2 లిటరసీ'

కారంపూడి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో అక్షరాంధ్ర - ఉల్లాస్ 2 లిటరసీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వయోజన విద్య సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండలంలో 13008 మంది నిరక్షరాస్యులు ఉన్నారని, ప్రస్తుతం 3300 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం రంగారెడ్డి, ఏపీవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


గుంటూరు : హౌసింగ్ బోర్డు నుంచి అంకిరెడ్డి పాలెం వెళ్లే దారిలో ఉన్న శ్రీ విజేతా సేవా సమితి ఇల్లు

ఆఖరి మజిలీకి అతిథి గృహం

450 శవాలకు అక్కడి నుంచే అంతిమ యాత్ర

ఆ మధ్య కాలంలో అటవీశాఖ రాష్ట్ర అధికారి ఒకరు హఠాత్తుగా మరణించారు. తాడేపల్లిలో ఆయన ఉండేది అద్దె ఇల్లు కావటంతో శవాన్ని అక్కడికి తీసుకురావద్దని ఇంటి యజమాని కరాఖండిగా చెప్పేశారు. దాంతో చేసేది లేక ఆయన భౌతిక కాయాన్ని కుటుంబసభ్యులు గుంటూరు అటవీశాఖ కార్యాలయం వద్ద ఉంచి అక్కడ నుంచే అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఆయన ఉన్నత స్థాయి అధికారి కాబట్టి అలా కార్యాలయంలో నైనా అవకాశం కల్పించారు. అదే పేదలు, దిగువ మధ్య తరగతి వారు మరణిస్తే వారి సంగతి ఇక చెప్పనక్కరలేదు. అద్దె ఇంట్లో ఉంటున్నారు కాబట్టి శవాన్ని కచ్చితంగా రోడ్డు మీద ఉంచాల్సిందే. ఆ రోజే ఏ వానో, వరదో వస్తే వారి కుటుంబసభ్యుల బాధ వర్ణనాతీతం. తమ వారికి కనీసం గౌరవప్రదంగా అంతిమ యాత్ర నిర్వహించుకోలేక పోయామనే దిగులు వారిని జీవితాంతం వెంటాడుతుంది. ఇలా ఎన్నో భౌతిక కాయాలకు అంతిమ యాత్రలో చేదు అనుభూతి కలిగిన ఉదంతాలను కళ్లతో చూసిన తర్వాత ఆవిర్భవించిందే శ్రీ విజేత సేవా సమితి. ఇది గుంటూరు నగరంలోనే ఉంది. హౌసింగ్ బోర్డు నుంచి అంకిరెడ్డి పాలెం వెళ్లే దారిలో ఒక పెద్ద ఇంటిని ఈ సేవా సంస్థ కార్యకలాపాల కోసం నిర్మించారు. కుల, మతాలతో సంబంధం లేకుండా ఎవరైనా దాన్ని ఉచితంగా వాడుకోవచ్చు. ప్రాణం పోగానే భౌతిక కాయాన్ని అక్కడకు తీసుకువచ్చి అంతిమ యాత్ర నిర్వహించుకోవచ్చు.

- రూపాయి ఖర్చు లేకుండా ఆవాసానికి ఏర్పాట్లు
- కర్మకాండలు చేసుకునే అవకాశం
- శ్రీ విజేతా సేవా సమితి ఆధ్వర్యంలో వినూత్న సేవ

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

2003లో ఆవిర్భవించిన శ్రీ విజేత సేవా సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. గుంటూరు ఏటీ అగ్రహారంలోని శ్రీ విజేత హైస్కూల్ డైరెక్టర్ చెరుకూరి శ్రీహరి దాన్ని స్థాపించారు. కొన్ని వేల అనాధ శవాలకు ఈ సంస్థ ద్వారా అంతిమ సంస్కారాలు నిర్వ హించారు. 2020లో అంకిరెడ్డిపాలెం వెళ్లే రోడ్డులో శ్రీ విజేత సేవా సంస్థ పేరుతో ఒక పెద్ద ఇంటిని నిర్మించారు. అప్పటి నుంచి ఇల్లు లేకుండా మరణించిన వారి భౌతిక కాయాన్ని ఇక్కడకు తీసుకువచ్చి అంతిమ సంస్కారం నిర్వహించుకునే విధంగా అవకాశం కల్పించారు. అక్కడకు తీసుకువచ్చే శవాల కోసం ప్రత్యేకంగా ఫ్రీజర్ బాక్స్‌లు కూడా అందుబాటులో ఉంచారు. అంతిమ యాత్ర సమయంలో వాడుకోవ టానికి స్వర్గ ధామం పేరుతో ఒక వాహనాన్ని కూడా ఏర్పాటు చేశారు. రూపాయి ఖర్చు లేకుండా స్మశాన వాటికకు తీసుకు వెళ్ళటానికి వీలుగా రవాణా సదుపాయం కల్పించారు. ఇప్పటి వరకు సుమారు 450కి పైగా శవాలను ఇక్కడకు తీసుకువచ్చి అంతిమ యాత్రలు నిర్వహించారు.

15 రోజుల వరకు ఉండే అవకాశం

మరణించిన వారి కుటుంబసభ్యులను 15 రోజుల వరకు కొంతమంది ఇళ్లలోకి రానివ్వరు. ఆ ఇబ్బందిని కూడా గమనించిన శ్రీ విజేత సేవా సంస్థ డైరెక్టర్ చెరుకూరి శ్రీహరి మరో ఏర్పాటు చేశారు. కేవలం అంతిమ యాత్ర నిర్వహించు కోవటం మాత్రమే కాకుండా మరణించిన వారి కుటుంబ సభ్యులు 15 రోజుల పాటు ఇక్కడే ఉండే సౌలభ్యం కల్పిం చారు. అవసరమయితే పెద్ద కర్మ రోజున బంధువులకు భోజనాలు పెట్టుకోవటానికి కూడా ఏర్పాట్లు చేశారు.

ప్రతి శనివారం పిడికిలి బియ్యం

శ్రీ విజేత సేవా సంస్థ డైరెక్టర్ చెరుకూరి శ్రీహరి నగరంలోని ఏటీ అగ్రహారం రెండో లైన్‌లో హైస్కూల్ ఏర్పాటు చేశారు. అక్కడ విద్యనభ్యసించే విద్యార్థులు ప్రతి శనివారం ఒక పిడికెడు బియ్యం తీసుకురావాలని చెబు తారు. వాటితో భోజనం తయారు చేసి వారానికి ఒకసారి గుంటూరు ప్రభుత్వాసు పత్రి వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. విద్యార్థులకు ఆహారం విలువ తెలియ జేయడానికి ఈ కార్యక్రమాన్ని తాము నిర్వహిస్తున్నట్లు చెరుకూరి శ్రీహరి తెలిపారు.

ఎన్నో ఉదంతాలు చూసిన తర్వాత...



అద్దె ఇంట్లో మరణిస్తే శవాన్ని ఇంట్లోకి రానివ్వరు. ఇటువంటి ఉదంతాలు నేను చాలా చూశాను. మనిషి జీవించినంత కాలం ఎంతో గౌరవంగా బతుకుతారు. వాళ్లు మరణించిన తర్వాత కూడా అదే గౌరవంతో అంతిమ యాత్రకు అవకాశం కల్పించాలన్న ఆలోచనతోనే ఈ ఇంటిని ఏర్పాటు చేశాము. ఎంతో మంది దీన్ని ఉచితంగానే వాడుకుంటారు. స్తోమత కలిగిన వాళ్లు అయితే విద్యుత్ బిల్లు ఇస్తారు. అదీ లేకుంటే ఉచితంగానే అన్ని చేసుకునే అవకాశం ఉంది.

-శ్రీ విజేత సేవా సంస్థ డైరెక్టర్ చెరుకూరి శ్రీహరి, గుంటూరు



గంటల తరబడి.. వెయిటింగ్

- తెనాలి రైల్వేస్టేషన్ హోంలో సాంకేతిక సమస్యలు
- గుంటూరు, రేపల్లె వైపు నుంచి వచ్చే రైళ్లకు రెడ్ సిగ్నల్
- గమ్యస్థానాలకు చేరుకోవడంలో జాప్యం

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడ - గూడూరు మూడో రైలు మార్గం నిర్మాణంలో భాగంగా తెనాలి రైల్వేస్టేషన్ యార్డులో జరిగిన పనులు సక్రమంగా పూర్తి కాలేదు. దీంతో నిత్యం ఏదో ఒక సాంకేతిక సమస్య రైల్వేస్టేషన్ హోంలో తలెత్తుతోంది. ఈ కారణంగా గుంటూరు నుంచి తెనాలి మీదగా తిరుపతి, చెన్నై సెంట్రల్ వైపునకు వెళ్లే రైళ్లకు క్లియరెన్స్ లభించడం లేదు. అలానే రేపల్లె నుంచి వచ్చే రైళ్లకు కూడా గ్రీన్‌సిగ్నల్ రాకపోతుండటంతో ఇంచుమించు గంటపాటు హోంలో ఆయా రైళ్లను నిలిపేయాల్సి వస్తోంది. ఆ తర్వాత క్లియరెన్స్ ఇచ్చి పంపినా సమయపాలన నష్టం జరిగిన కారణంగా గమ్యస్థానాలకు గంట నుంచి రెండు గంటల ఆలస్యంగా చేరుతున్నాయి. చెన్నై, నారాయణాద్రి, డెల్టా, శబరి తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ సమస్య తలెత్తుతోంది. లాగ్‌బుక్‌లో రోజుకో కారణాన్ని తెనాలి రైల్వేస్టేషన్ అధికారులు పొందుపరుస్తోండటంతో హోంలో సమస్య తలెత్తడానికి అసలు కారణం ఏమిటనేది అంతుచిక్కకుండా ఉన్నది.

సికింద్రాబాద్ వైపు నుంచి గుంటూరుకు రైళ్లు సకాలంలో చేరుకుంటున్నాయి. గుంటూరు నుంచి తెనాలికి గరిష్టంగా 20 నిమిషాల వ్యవధిలోనే చేరుకోవచ్చు. అయినప్పటికీ మధ్యలో ఎక్కడైనా సమయపాలన దెబ్బతింటే దానిని భర్తీ చేసేందుకు కొన్ని రైళ్లకు ఎక్కువ ప్రయాణ సమయాన్ని కేటాయించారు. ఇప్పుడు అది కూడా చాలడం లేదు. గత కొన్ని రోజుల నుంచి చెన్నై, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లు తెనాలి రైల్వేస్టేషన్ హోంకు చేరుకొని గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురు చూస్తున్నాయి. దీనివలన గుంటూరు నుంచి తెనాలికి ప్రయాణ సమయం గం టన్నరకు పైగా పడుతున్నది. గత రాత్రి అయితే గుంటూరు నుంచి రాత్రి 10.19కి బయలుదేరిన చెన్నై ఎక్స్‌ప్రెస్ తెనాలి చేరుకొనేసరికి 11.50 అయింది. నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ గుంటూరులో రాత్రి 10.59కి బయలుదేరితే తెనాలికి అర్ధరాత్రి దాటాక 12.27కి చేరింది. దీనివలన రెండు గంటల 13 నిమిషాల ఆలస్యంగా తిరుపతి చేరుకోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. డెల్టా ఎక్స్‌ప్రెస్ కూడా రేపల్లె నుంచి వచ్చే టప్పుడు తెనాలి హోంలో నిలిపేస్తున్నారు.

ఇరువైపులా క్యాబిన్‌లు తీసేయడం వలనేనా...

గతంలో తెనాలి రైల్వేస్టేషన్‌కు ఇరువైపులా క్యాబిన్‌లు ఉండేవి. వాటిల్లో జూనియర్ స్టేషన్ మాస్టర్లు ఉండేవారు. డిప్యూటీ స్టేషన్ మాస్టరు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంపై ఉండి క్యాబిన్‌లో ఉండే జూనియర్లకు హాట్‌లైన్ కమ్యూనికేషన్ పరికరాల ద్వారా మార్గదర్శకం చేసేవారు. దాంతో ఎలాంటి సమస్యలు తలెత్తేవి కావు. ఇప్పుడు మూడో రైలు మార్గం నిర్మాణంలో భాగంగా క్యాబిన్‌లు పూర్తిగా తొలగించారు. దాంతో అంతా స్టేషన్‌లోనే కేంద్రీకృతమౌతున్నది. సీనియర్ మాస్టర్లు కేవలం కాషన్ ఆర్డర్ల జారీకి పరిమితం అవుతున్నారు. దీంతో జూనియర్‌లు సక్రమంగా హ్యాండ్లింగ్ చేయలేక హోంలో రైళ్లను నిలిపేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

పల్లెలకు పైసలొచ్చాయ్..!

(5వ పేజీ తరువాయి)

మరమ్మత్తులు, తాగునీటి వసతి, ఆట స్థలాల అభివృద్ధి వంటి పనులకు ఈ నిధులను ఖర్చు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

నిధులు విడుదలతో పంచాయతీల పాలక వర్గాలు హర్షం

ఎనిమిది నెలల తర్వాత నిధులు విడుదల కావడంతో పంచాయతీల పాలక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నిధుల విడుదలతో గ్రామాల్లో సమస్యలు తీరే అవకాశం ఏర్పడిందని పేర్కొంటున్నాయి. ఈ నిధులతో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని చెబుతున్నాయి. కాగా, పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సం క్షేమ సంఘం ముఖ్య సలహాదారుడు, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పంచాయ తీలను బలోపేతం చేస్తోందన్నారు. నిధులు విడుదల చేయడం పట్ల అయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

బార్లు బాధలు

(5వ పేజీ తరువాయి)

దృష్టి పెట్టారు. దరఖాస్తు చేయడానికి వారికున్న సాదకబాధకాలు పరిష్కారానికి హామీ ఇస్తున్నారు. ముందు బార్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేయాలని కోరుతున్నారు.

నేతల వద్దకు క్యూ..

బార్ల దరఖాస్తుల అంశాన్ని ఉన్నతాధికారులు అత్యంత ప్రయారిటీగా తీసుకోవడం ఒక ఎత్తయితే, స్పందన లేకపోతే పోస్టింగే ప్రమాదంలో పడే అవకాశాలు ఉండడంతో ఎక్సైజ్ అధికారులు ఏ ఒక్క అవకాశాన్ని వదలకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా నియోజక వర్గాల్లో కీలకంగా ఉండే అధికార పార్టీ నేతల వద్దకు వెళ్లి ఎలాగైనా బార్లకు దరఖాస్తులు పడేలా చూడాలని కోరుతున్నారు. స్థానికంగా ఉన్న ఆశావహులకు నేతలతో ఫోన్లు చేయిస్తు న్నారు. ఇప్పటికే మద్యం షాపులు నిర్వహిస్తున్న వారిని, ఆర్థికంగా బలంగా ఉండి గతంలో ఈ రంగంలో ఉన్నవారిని కలిసి దరఖాస్తులు వేయించేలా అధికారులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

వ్యాపారం చేయలేం..

ఇప్పటికే మద్యం షాపుల విషయంలోనే పడుతూ లేస్తూ వ్యాపారం చేస్తున్నామని కొత్తగా బార్ల భారాన్ని మోయలేమని వ్యాపారులు తెగేసి చెబుతున్నట్లు తెలుస్తోంది. పాలక పార్టీ నేతలు, వివిధ శాఖల అధికారులు, క్షేత్రస్థాయిలో ఉండే ఎక్సైజ్ సిబ్బందికి ఇలా ప్రతి ఒక్కరికీ ముడుపులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని, ఇవన్నీ బేరీజు వేసుకుని వ్యాపారం చేసేకన్నా మిన్నకుండడమే మేలనే అభిప్రాయాన్ని ఆశావహులు వ్యక్తం చేస్తున్నారు. బార్ల విషయంలో ప్రభుత్వం లైసెన్స్ ఫీజు విషయంలో పునరాలోచన చేస్తుందని అనుకున్నాం కానీ ఇలా అధికారులను తమపైకి పంపి ఒత్తిడి పెడుతుందనుకోలేదని వ్యాపారులు వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 8 మందికి...

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు


డాక్టర్ జే ప్రతాప్


పీ సునీత రాణి


గుమ్మడి సునీలా మాధవి


అవ్వారు భద్రావతి

గుంటూరు(విద్య), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 5వ తేదీన రాష్ట్రస్థాయిలో అందించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఉమ్మడి జిల్లా నుంచి ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. బాపట్ల జిల్లా తుమ్మలపాలెం జడ్పీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ జే ప్రతాప్, అద్దంకి ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయురాలు ఎం ధనలక్ష్మి, పల్నాడు జిల్లా నకరికల్లు జడ్పీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయురాలు శివకుమారి, పల్నాడు జిల్లా బీ.పురం జడ్పీహెచ్ఎస్ గ్రేడ్ 2 హెచ్ఎం ఎం పార్వతి, గుంటూరు జిల్లా కనపర్రు ఎంపీయూపీ బీపీఆర్ పాఠశాల ఉపాధ్యాయురాలు వై రాజ్యలక్ష్మి, గుంటూరు ఎస్ఎస్ఎన్ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు పీ సునీత రాణి, గుంటూరు పట్టాభిపురం మున్సిపల్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గుమ్మడి సునీల మాధవి, గుంటూరు జిల్లా చీలిపాలెం మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు డాక్టర్ అవ్వారు భద్రావతి రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. ఈ నెల 5వ తేదీన జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో వీరికి అవార్డులు అందజేయనున్నారు.

తగ్గిన నిమ్మ ధర

- గతంలో బస్తా 5 వేలు పైచిలుకు
- ఇప్పుడు బస్తా రూ.1700
- ఆనందం వ్యక్తం చేసిన వీధి వ్యాపారులు



పిడుగురాళ్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఆకాశాన్నంటేలా ఉన్న నిమ్మకాయ ధరలు ఇప్పుడు తగ్గాయి. ఒక్కప్పుడు రూ.4.500 నుంచి రూ.6 వేల వరకు ధర పలికిన 50 కేజీల నిమ్మకాయల బస్తా.. ఇప్పుడు సగానికిపైగా తగ్గింది. మొన్నటివరకు బెల్లంకొండ, పెదకూరపాడు, అచ్చంపేట, కారంపూడి, దాచేపల్లి, రాజుపాలెం మండలాల రైతులు పండించిన నిమ్మకాయలను మధ్యవర్తులు కొని అధిక ధరలకు వాటిని వ్యాపారులకు విక్రయించేవారు. అయితే గత నెలలో కురిసిన అధిక వర్షాలకు పల్నాడు ప్రాంతంలోని నిమ్మతోటల్లో కాయలు రాలిపోవడం, కొత్త కాపు రాకపోవడంతో ప్రకాశం జిల్లా కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం ప్రాంతాల నుంచి రైతులు పిడుగురాళ్ల, గురజాల, దాచేపల్లి ప్రాంతాలకు చేరుకొని నేరుగా వీధి వ్యాపారులకు 50 కేజీల బస్తా రూ.1500లకు విక్రయిస్తున్నారు. పల్నాడు ప్రాంతంలో పండిన నిమ్మకాయల సైజు, నాణ్యతకు రెండింతల సైజులో మార్కాపురం, యర్రగొండపాలెం ప్రాంతాల నుంచి నిమ్మకాయలు పట్టణ ప్రాంతాలకు చేరవేస్తుండటంతో వ్యాపారులు ఎగిరి గంతేస్తున్నారు. నిమ్మకాయల ధరలు ఎక్కువగా ఉన్నప్పుడు అమ్మాలంటే ఎంతో ఇబ్బందిగా ఉండేదని, కొనుగోలుదారులు అడిగే సవా లక్ష ప్రశ్నలకు ఎంత ఓపికగా సమాధానం చెప్పినా కొనుగోలు అంతగా ఉండేవి కాదని లక్ష్మయ్య అనే వ్యాపారి చెప్పారు. ఇప్పుడు ధర తగ్గడంతో అమ్మకాలకు ఇబ్బంది లేకుండా ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

విద్యార్థులు చదువుతో పాటు

క్రీడల్లోనూ రాణించాలి

మా రోజుల్లో మైదానాలు లేవు ఇప్పుడు మెండుగా సౌకర్యాలు

మహిళా శిశు సంక్షేమ మంత్రి సంధ్యారాణి

ఏఎన్‌యూ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూట్ అమరావతి ఆధ్వర్యంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల రాష్ట్రస్థాయి నాలుగో లెవెల్ క్రీడా పోటీలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ గిరిజన మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి జీ సంధ్యారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా ర్థులు పాఠ్యాంశాలనే కాకుండా క్రీడలనూ తమ జీవితాల్లో భాగం చేసుకో వాలని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించి వారిని జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే విధంగా అధికా రులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాము ఆడుకునే రోజుల్లో మైదానాలు ఉండేవి కావని, ఇప్పుడు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని అన్నారు. విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదల కోసం ప్రభుత్వ వసతి గృహాల్లో రాష్ట్ర ప్రభుత్వం మంచి పౌష్టికాహారం అందిస్తు న్నట్లు మంత్రి చెప్పారు. భాషా పాఠ్యాంశాలపై ఇబ్బందులు కలుగుతున్నా యని విద్యార్థుల నుంచి తరచూ తమకు ఫోన్లు వస్తున్నాయని, వాటిపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠ శాలల్లో తెలుగు, ఆంగ్లం, హిందీలలో అవగాహన కలిగిన అధ్యాపకులను నియమిస్తామని సంధ్యారాణి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సెక్రటరీ గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ వైస్ ఛైర్మన్ యం మల్లికార్జున నాయక్, డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ సదా భార్గవి, వ్యాయమ కళాశాల ప్రిన్సిపాల్ పీపీఎస్ పాల్ కుమార్, స్పోర్ట్స్ కన్వీనర్ శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు బ్రో..

కేఎల్‌యూలో మాదక ద్రవ్యాల వ్యతిరేక సదస్సులో ఈగల్ ఐజీ రవికృష్ణ

తాడేపల్లి (వడ్డేశ్వరం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల మహమ్మారి నుంచి తమ బిడ్డలను కాపాడుకునేందుకు ప్రతి తల్లీ ఒక అంబాసిడర్ కావాలని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో బుధవారం కేఎల్ ఉమన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో రాష్ట్రంలో మాదక ద్రవ్యాలను సమూలంగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యతని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా కేఎల్‌యూలో కూడా నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులను ఈగల్ కార్యక్రమాలలో భాగస్వామ్యులను చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎవరైనా మాదక ద్రవ్యాల బారిన పడితే టోల్ ఫ్రీ నెం.1972కు గానీ వాట్సాప్ నెం.8977781972కు గానీ తెలియజేస్తే బాధితులను ఆ బారి నుంచి కాపాడతామని ఐజీ రవికృష్ణ హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా అడిషనల్ ఎస్పీ ఏటివి రవికుమార్ మాట్లాడుతూ, గంజాయి కేసుల్లో అరెస్టయిన వారు జీవితాంతం నేరస్థులుగా మిగిలిపోతారని అన్నారు. గంజాయి విక్రయించినా, వినియోగించినా శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేఎల్‌యూ వీసీ సారధివర్మ, ప్రో. వీసీలు డాక్టర్ ఎవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్ వెంకటరామ్, డాక్టర్ కె రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ కెఆర్ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీధర్, ఉమెన్ డెలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె రూత్ రమ్య తదితరులు పాల్గొన్నారు.


ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణను సత్కరిస్తున్న కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే సుబ్బారావు, డీన్ కేఆర్ఎస్ ప్రసాద్ తదితరులు

సీనియర్స్ విభాగంలో వేటపాలెం ఎడ్ల సత్తా

- ప్రత్తిపాడులో ముగిసిన రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు
- జూనియర్స్ విభాగంలో ప్రకాశం జిల్లా ఎడ్లు ముందంజ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో వారం రోజులుగా జరుగుతున్న నందమూరి తారక రామారావు మెమోరియల్ రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ పోటీలలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 190 వరకు ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఈ పోటీలలో సీనియర్స్ విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 4,142.2 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానంలో నిలవగా, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట మండలం, హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేందర్ రెడ్డి, సుంకి సాకేత్ రెడ్డికి చెందిన ఎడ్ల జత 4,014.10 అడుగుల దూరం బంగను లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. కడప జిల్లా మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేష్ యాదవ్‌కు చెందిన ఎడ్ల జత 3,649.10 అడుగుల దూరం లాగి మూడవ స్థానంలో నిలిచింది.

జూనియర్స్ విభాగంలో..

జూనియర్స్ విభాగంలో ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్ల గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్ల జత 3,300 అడుగుల దూరం బండనులాగి ప్రథమ స్థానంలో నిలవగా, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరికి చెందిన ఎడ్ల జత 3000 అడుగుల దూరం బండను లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. హైదరాబాద్ ప్రగతి రిసార్ట్స్‌కు చెందిన మేక ప్రదీప్‌కు చెందిన ఎడ్ల జత 2,940.10 అడుగుల దూరం బండనులాగి తృతీయ స్థానంలో నిలిచింది. విజేతలైన ఎడ్ల యజమానులకు ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, గల్లా మాధవి, నసీర్ అహమ్మద్‌తో పాటు గల్లా రామచంద్రరావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరి శ్రీనివాసరావు, గింజుపల్లి శివరామప్రసాద్, కుర్రి సుబ్బారెడ్డి, వెలివెల్లి సుబ్బారావు, కాసు పెంటారెడ్డి, చిన్నం శ్రీకాంత్, పమిడి అంజియ్య చౌదరి అన్ని గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల యజమానికి నగదు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్, గల్లా మాధవి

పల్నాడు వార్తలు

నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా షమీమ్ ఉల్లాఖాన్


షమీమ్‌ఉల్లా ఖాన్

వినుకొండ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు చెరుకుంపాలెం షమీమ్ ఉల్లాఖాన్‌ను నియమించినట్లు పార్టీ కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా షమీమ్‌ను నియమించడంపై నియోజకవర్గంలోని టీడీపీ, ముస్లిం నాయకులు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిలకలూరిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఫీడర్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ ఆర్.అశోక్ కుమార్ బుధవారం తెలిపారు. టౌన్-2 పరిధిలోని కృష్ణారెడ్డి డొంక, కుమ్మరి కాలనీ, నరసరావుపేట సెంటర్ నుంచి ఏఎంజే వరకు జాతీయ రహదారికి ఇరువైపుల ఉన్న ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని పేర్కొన్నారు.

బొల్లాపల్లి ఎంఈవోగా చిన్నపరెడ్డి బాధ్యతల స్వీకరణ


చిన్నపరెడ్డి

బొల్లాపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో మండల విద్యాశాఖాధికారిగా చిన్నపరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వినుకొండ జడ్పీ పాఠశాల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చిన్నపరెడ్డిని బొల్లాపల్లి ఎంఈవోగా నియమిస్తూ ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన చిన్నపరెడ్డిని ఎంఈవో-2 యశోదర, ఉపాధ్యాయసంఘాల నేతలు, ఉపాధ్యాయులు, ఎం ఆర్సీ సిబ్బంది ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎడాపెడా పురుగు మందులు వాడొద్దు

● వ్యవసాయ శాస్త్రవేత్త నగేష్

చిలకలూరిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎడాపెడా పురుగు మందులు వాడొద్దని వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.నగేష్ బుధవారం రైతులను కోరారు. చిలకలూరిపేట మండలం పసుమర్రులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగులైన పేను బంక 10-20 శాతం, పచ్చదోమ ఆకుకు 2, తెల్ల దోమ ఆకుకు 6, తామర పురుగులు ఆకుకు10 శాతం ఉంటేనే పంటకు నష్టపరిమితి స్థాయి కలిగించే దశకు చేరుకుంటాయని చెప్పారు. ఆ దశలో మాత్రమే పురుగు మందులు వాడాలని కోరారు. ఏవో సిహెచ్ సరిత మాట్లాడుతూ కౌలు రైతులు తప్పనిసరిగా గుర్తింపు కార్డు పొందాలని కోరారు. మండలంలో ఎరువుల కొరత లేదని, సొసైటీల ద్వారా కూడా అందు బాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో తిరుమల, ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలవాల గ్రామంలో బుధ వారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం నుంచి వచ్చిన ఏవో అరుణ మాట్లాడుతూ మిరపలో ఎండు తెగులు నివా రణ కోసం చేపట్టాల్సిన చర్యలు వివరించారు. ఏవో శివ లలిత మాట్లాడుతూ వరిలో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏవో, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

యడ్లపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌లో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు నేత్రదానంపై వక్తృత్వ పోటీలను బుధవారం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ భువనేశ్వరి నేత్రదానం ఆవశ్యకత కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భరద్వాజ, సీహెచ్‌వో పున్నారావు, హెచ్‌ఎం విజయభారతి, యడ్లపాడు పీహెచ్‌సీ కంటి వైద్య నిపుణులు డాక్టర్ శివరామసుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యనిర్వాహక ఇంజనీరుగా అదనపు బాధ్యతల స్వీకరణ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట డివిజన్ పంచాయతీరాజ్ ఇన్‌స్టిట్యూషన్‌లో కార్యనిర్వాహక ఇంజనీరుగా కే ముత్తయ్య బుధవారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ముత్తయ్యకు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

గణపతికి సీతాఫలాలతో పూజ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద ఏర్పాటు చేసిన మహావీర గణపతికి బుధవారం 1108 సీతాఫలాలతో సహస్ర అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం గరికతో సహస్రనామార్చన పూజ, స్వామికి ఉత్సవ విగ్రహానికి సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో, పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. మహావీర గణపతిని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ వనమా పవన్‌కుమార్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వినుకొండటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి వెళ్లి వస్తూ మండలంలోని చీకటీగలపాలెం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. నకరికల్లు మండలం చీమ లమర్రికి చెందిన తోట చంద్ర శేఖర్ (50) దర్శిలో ఓ శుభకార్యంలో పాల్గొని ద్విచక్రవాహనంపై వినుకొండకు వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శివపార్వతి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనలో ముందుంటున్న ఆర్యవైశ్య సమాజం

● భీమలింగేశ్వరస్వామి కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే చదలవాడ


ఆలయ కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సమాజం వ్యాపార ప్రావీణ్యంతో పాటు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. బుధవారం నరసరావుపేటలో గంగా సమేత భీమ లింగేశ్వ ర స్వామి ఆలయం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. నూతన కార్యవర్గ సభ్యులుగా మద్ది అంజనాదేవి, కొండకావూరి ప్రేమ్ కుమార్, కొత్తమాసు వెంకయ్య, కోట సుబ్రహ్మణ్యం, కోట వెంకటేశ్వర్లు, నాగసరపు వెంకటజ్యోతి, తాటికొండ వెంకటేశ్వర శర్మ, పూజల ఆదిలక్ష్మి, గోగుల సాయికిషోర్, మురుగుల శివ పార్వతి ప్రమాణం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ దేవాలయాల నిర్మాణంలో ఆర్యవైశ్యుల సహకారం అమూల్యమన్నారు. కూటమి గెలుపులో ఆర్యవైశ్యులు కీలకపాత్ర పోషించారని చెప్పారు. వైసీపీ హయాంలో వ్యాపారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కానీ కూటమి ప్రభుత్వంలో వ్యాపారులు ప్రశాంతంగా వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, కొల్లి బ్రహ్మయ్య, కూటమి. ఆర్య వైశ్య సంఘం నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

కాపు విద్యార్థులకు ఆర్థిక సాయం

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతూరు ఆవుల సుబ్బారావు కన్వెషన్ హాల్లో నియోజకవర్గ శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం ఆధ్వర్యంలో పేద కాపు విద్యార్థులకు పోతుల శంకర్ ఆధ్యక్షతన ఆర్థిక సాయం అందజేసినట్లు ప్రధాన కార్యదర్శి మంచాల వెంకట తిరుపతిరావు బుధవారం తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరై ఆర్థికసాయం అందజేశారు. పగడాల హేమ హన్విత, నాగలక్ష్మీ, సింగంశెట్టి ఉషామల్లిక, తిరుమలశెట్టి నిఖిల్‌లకు ఒకొక్కరికి రూ.10 వేలు అందజేశారు. పోతుల శంకర్, యతిరాజు రామ్‌మోహన్, రామిశెట్టి సుబ్బారావు, మహిపతి లక్ష్మీకుమార్, రామాయణం రామకృష్ణ సహకారం సౌజన్యంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. నీట్ పీజీ2025లో ఆల్ ఇండియా ర్యాంక్ 1820 సాధించిన ముద్ద ప్రవల్లికను అభినందించారు. కార్యక్రమంలో మంచాల వెంకట తిరుపతిరావు, అల్లం శెట్టి మోహనరావు, దామ శ్రీనివాసరావు, రాయల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


సభలో ప్రసంగిస్తున్న ముఖ్యఅతిథి యండమూరి

ఘనంగా ఎన్ఈసీ గ్రాడ్యుయేషన్ డే

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల 8వ గ్రాడ్యుయేషన్ డే బుధవారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ నవలా రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్ మాట్లాడుతూ కష్టపడితే జీవితంలో సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. ఆకాశమే హద్దుగా లక్ష్యాలు ఉండాలన్నారు. మరో ముఖ్యఅతిథి డేటా వ్యాలీ ఫౌండర్, సీఈవో సీహెచ్ పవన్‌కుమార్ మాట్లాడుతు విద్యార్థులు తమ అమూల్యమైన సమయాన్ని తెలివైన వారితో గడుపుతూ నైపుణ్యం పెంచుకోవాలన్నారు. జేఎన్‌టీయూకే ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు సమయం విలువను గుర్తించుకుని ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడాలన్నారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ కళాశాలలోని సాంకేతిక సౌకర్యాలను సద్వినియోగించుకొని విద్యార్థులు బంగారు భవిష్యత్తు నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, సెక్రటరీ రమేష్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు ఇతర ఆధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణానికి అనుమతులపై విచారణ


మతుకుమల్లిలో రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీలు

మతుకుమల్లి(శావల్యాపురం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మతుకుమల్లిలో గతంలో సెల్ టవర్ నిర్మాణానికి పంచాయతీ అధికారులు ఇచ్చిన అనుమతుల పై పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు గుంటూరు, నర్సరావుపేట డ్వామా పీడీలు శంకర్, సిద్దలింగమూర్తిలు బుధవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సెల్ టవర్ అనుమతులు విషయంలో పంచాయతీ కార్యదర్శి అమరేశ్వరరావుపై అవినీతి ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు ఆయన్ని విధుల నుంచి సస్పెండ్ చేశారు. సస్పెండ్‌కు గురైన అమరేశ్వరరావు ఇటీవల పంచాయతీరాజ్ కమిషనర్‌ను కలసి రికార్డులన్నీ సక్రమంగా ఉన్నాయని, కానీ తనపై అధికారులు తప్పుడు నిర్ణయం తీసుకున్నారని, పునఃపరిశీలన చేయించి తనకు న్యాయం చేయాలని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలతో డ్వామా పీడీలు గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలించి అనంతరం స్థానికులను విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. నివేదికను కమిషనర్‌కు అందజేసి ఆయన ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ సిద్దలింగమూర్తి తెలిపారు. వారితో ఇన్‌చార్జి ఎంపీడీవో సుగుణ, ఇన్‌చార్జి ఏపీవో ఏపీవో ఆంజనేయరాజు పాల్గొన్నారు.

సమావేశాలకు రాకుంటే చర్యలు : ఎంపీపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఝాన్సీదయాసాగర్

యడ్లపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, లేకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఎంపీపీ ఝాన్సీదయాసాగర్ హెచ్చరించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఉదయం 11గంటలకు సమావేశం జరగాల్సి ఉండగా అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోవడంతో 40 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. ఎంపీపీ మాట్లాడుతూ సమావేశానికి హాజరుకాని వారికి మెమోలు జారీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. విద్యాశాఖకు సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి ఎంఈవో నాగరత్నం వివరిస్తుండగా ఎంపీటీసీ అరుణ్ జోక్యం చేసుకుని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రాజెక్టు వర్క్ పేరుతో పేజీల కొద్దీ అంశాలను ఇస్తున్నారని, విద్యార్థుల, తల్లిదండ్రులు జిరాక్స్ సెంటర్ల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. ఎంఈవో సమాధానం ఇస్తూ పాఠశాల హెచ్‌ఎంలతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన చర్చలో చెంఘీజ్‌ఖాన్‌పేట సర్పంచ్ ఆంజనేయులు మాట్లాడుతూ తమ గ్రామం యడ్లపాడు సొసైటీ పరిధిలో ఉందని, తమకు ఎరువులు అందడం లేదని, నాలుగు గ్రామాలకు కలిపి 100 బస్తాల ఎరువు సరఫరా చేశారని ఆ మొత్తం ఎలా సరిపోతుందని ఏవో హరిప్రసాద్‌ను ప్రశ్నించారు. సొసైటీ కార్యదర్శితో చర్చించి ఎరువుల కొరత లేకుండా చూస్తామని ఏవో హామీ ఇచ్చారు. వైద్య, పంచాయతీరాజ్, గృహ, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్ శాఖలకు సంబంధించి అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

శావల్యాపురం సొసైటీ కార్యాలయంలో చోరీ

శావల్యాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురంలో గుంటూరు-కర్నూలు జాతీయరహదారి ప్రక్కనున్న సొసైటీ కార్యాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు సొసైటీ కార్యాలయానికి ఉత్తరం దిక్కునున్న గేటు తాళాలు పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించి 4 బీరువాలు పగులగొట్టి రూ.1500 నగదు, 2హార్డ్‌డిస్క్‌లు దొంగిలించారని తెలిపారు. ఉదయాన్నే విధులకు హాజరయ్యేందుకు వచ్చిన సిబ్బంది గేటుకు తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి సొసైటీ చైర్మన్ గడిపూడి విశ్వనాధం, సీఈవో జాలాది నాగప్రసాద్‌లకు తెలిపారు. వారు కార్యాలయానికి వచ్చి ఎస్ఐ లోకేశ్వరరావుకు విషయాన్ని తెలిపారు. ఎస్ఐ సిబ్బందితో ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ సమాచారంతో క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది.

కరెంట్ తీగలు తెగిపడి వ్యక్తికి గాయాలు

ఈపూరు,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొగ్గరంలో కరెంట్ తీగలు తెగిపడి వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సిద్ది ఆంజనేయులు బ్రహ్మంగారి గుడి వద్ద బుధవారం చెట్టు కొమ్మలు నరుకుచుండగా అవి పక్కన ఉన్న 11కేవీ కరెంట్ తీగలు మీద పడడంతో తెగి కిందపడ్డాయి. ఆంజనేయులు మీద కరెంటు తీగలు పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని నరసరావుపేట ఆసుపత్రికి తరలించారు.

ఎన్డీఏ ప్రభుత్వంలోనే రైతు సంక్షేమం

● మార్కెట్ కమిటీ చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్

వినుకొండ టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వంలోనే రైతు సంక్షేమం సాధ్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్ అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్లతో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో ముఖ్యఅతిథిగా మార్కెట్‌యార్డు చైర్మన్ మీసాల మురళీకృష్ణయాదవ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగకుండా కనీసం కాలువలో చెట్లు, పూడిక గానీ తీయకుండా అలాగే వదిలేశారని ప్రస్తుతం ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సహకారంతో కాలువలు బాగు చేయడంతో చివరి గ్రామాల వరకు ప్రతి ఎకరాకు నీరు సకాలంలో అందుతుందని తెలిపారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలని అన్నారు. అలాగే రైతుసేవాకేంద్రాల్లో డీఏపీ, యూరియా అందుబాటులో ఉంటాయని రైతులకు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ కృష్ణనాయక్, వైస్ ప్రెసిడెంట్ కాలింగి శ్రీనివాసరావు, గుర్రప్ప నాయుడుపాలెం, సొసైటీ చైర్మన్ ముండ్రు సుబ్బారావు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మార్కెట్ యార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు ఆయకట్టు రైతులకు తీరనున్న కష్టాలు


ఎన్నెస్పీ కాలువ వద్ద పైలెట్ చానల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఈపూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా సాగు, తాగునీటి కోసం అవస్థలు పడుతున్న ఈపూరు చెరువు ఆయకట్టు రైతులకు బాధలు తీరనున్నాయి. చెరువు ఆయకట్టు పరిధిలో ఈపూరు, గోపువారిపాలెం, చిట్టాపురం, కొండాయిపాలెం రైతులకు సుమారు మూడు వేల ఆరు వందల ఎకరాలు సాగు చేసుకుంటున్నారు. చెరువు నీరు సరిపడక పంటల కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రైతు లు పడే బాధలు గుర్తించిన గోపువారిపాలెం సర్పంచ్ గోనుగుంట్ల శ్రీని వాసరావు, గ్రామాల ప్రజలు చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు విన్నవించారు. స్పందించిన జీవీ సీఎం చంద్రబాబునాయుడుకు లేఖ ద్వారా తెలియజేశారు. ముఖ్యమంత్రి సూచన మేరకు ఎన్నెస్పీ, ఇరిగేషన్ అధికారులు సాగునీటి సంఘాల చైర్మన్లతో కలిసి బొమ్మరాజుపల్లి వద్ద పైలట్ చానల్‌ను మంగళవారం పరిశీలించారు. అక్కడ తూము ఏర్పాటు చేసి సుమారు 20 క్యూసెక్కుల నీరు కాలువ నుంచి నిరంతరం చెరువుకు సరఫరా చేస్తే సాగు, తాగు నీటి సమస్యలు తీరుతాయని అధికారులకు డీసీ చైర్మన్ గడిపూడి వేణుగోపాలరావు, సాగునీటి సంఘాల అధ్యక్షులు, రైతులు చెప్పారు. అధికారులు రైతుల అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో నాగార్జున సాగర్ కుడిప్రధాన కాలువ డీఈ సాధినేని విజయలక్ష్మీ, ఈఈ కే ఖాదర్, ఇరిగేషన్ ఏఈ కోటేశ్వరరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావర్ల జగ్గారావు, సాగునీటి సంఘాల అధ్యక్షులు ఉన్నారు.

ఇతర రాష్ట్రాలకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం జగ్గారావు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా నుంచి పక్క రాష్ట్రాలకు ఎరువులను తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు వారి షాపు లైసెన్సులను రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం జగ్గారావు తెలిపారు. జిల్లాలో ఎరువులను ఎమ్మార్పీ ధరలు కంటే అధిక ధరలకు విక్రయిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. నరసరావుపేట పట్టణం లోని పలు ఎరువుల దుకాణాలు జగ్గారావు బుధవారం తనిఖీ చేశారు. ఎరువుల గోడౌన్స్ లో స్టాక్‌ను పరిశీలించారు. ఆయనతో పాటు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, ఏవో ఐ శాంతి, తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్, డిప్లమా విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏఎంరెడ్డి ఇంజనీరింగ్, డిప్లమా మెకానికల్ విద్యార్థులు జోకిపర్రు సమీపంలోని జోసిల్ లిమిటెడ్‌ను బుధవారం సందర్శించారు. పరిశ్రమలో జరిగే ఉత్పత్తి ప్రక్రియలు, యంత్రాల పని విధానం, భద్రతా నియమాలు గమనించి విలువైన అనుభవాన్ని పొందారు, ఈ సందర్భంగా కళాశాల కార్య దర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి పరిశ్రమ సందర్శనలు విద్యా ర్థుల భవిష్యత్తులో కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. కార్యక్రమంలో డిప్లమా ప్రిన్సిపాల్ కే కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినుకొండలో జబర్దస్త్ ఆర్టిస్టుల సందడి


సందడి చేస్తున్న ఆర్టిస్టులు

వినుకొండ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుక ల్లో భాగంగా 7వ రోజు నిమజ్జనం కార్యక్రమంలో పట్టణంలోని పాత గ్రంధాలయం బజార్ కమిటీ వాళ్ళు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా జబర్దస్త్ ఆర్టిస్టులు సందడి చేశారు. ఈ కార్యక్ర మంలో జబర్దస్త్ ఫేమ్ సద్దాం అండ్ టీమ్ పాల్గొన్నారు. వారు చేసిన స్కిట్స్ భక్తులను అలరించాయి. డీఎస్పీ ఈవెంట్స్ వారు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నటుల డూప్‌లు అలరించారు.

సింథటిక్ రన్నింగ్ ట్రాక్ నిర్మాణానికి శ్రీకారం


రన్నింగ్ ట్రాక్ పనులను పర్యవేక్షిస్తున్న నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలనే ఉద్దేశంతో అంతర్జాతీయ ప్రమాణాలతో సింథటిక్ రన్నింగ్ ట్రాక్ నిర్మాణానికి గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి బుధవారం శ్రీకారం చుట్టారు. తన స్వగ్రామమైన చిరుమామిళ్ళ గ్రామంలోని నడికట్టు రామిరెడ్డి ఉన్నత పాఠశాలలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో ఒలింపిక్ స్టాండర్డ్‌తో 200 మీటర్ల పొడవుతో నిర్మించనున్న ఈ సింథటిక్ రన్నింగ్ ట్రాక్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కిషోర్ నడికట్టు రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.


జెండా ఊపి రెడ్ రన్ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

హెచ్‌ఐవీపై అవగాహనకు రెడ్‌రన్ మారథాన్

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలో హెచ్‌ఐవీపై అవగాహన కోసం ఐదు కిలో మీటర్ల రెడ్‌రన్ మారథాన్ నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి జెండా ఊపి కార్యక్ర మాన్ని ప్రారంభించారు. పట్టణ శివారు కోటప్ప కొండ రోడ్డులోని బైపాస్ నుంచి మండలంలోని ఎల్లమంద గ్రామం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఆయన మాట్లాడుతూ యువతీ యువ కుల్లో ఎయిడ్స్‌పై అవగాహన కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలి పారు. ఈ కార్యక్రమాలు అక్టోబరు 12వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహి స్తామన్నారు. ఎవరికైనా హెచ్‌ఐవీ అని అనుమానాలు ఉంటే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలోని ఐసీటీసీ కేంద్రాలను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జానీబాషా, వివిధ కళాశాల విద్యార్థులు, పలు స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్, వోల్క్స్ పాంథమ్ అవగాహన ఒప్పందం

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల, హైదరాబాదు వోల్క్స్ పాంథమ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని ప్రిన్సిపాల్ జీ.నాగ మల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. ఒప్పంద పత్రాన్ని హైదరాబాదు వోల్క్స్ పాంథమ్ ఎండీ సుధీర్, కళాశాల చైర్మన్ షేక్ మీరావలికి అందించారు. ఇన్స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో వోల్క్స్ పాంథమ్, ఈశ్వర్ ఇంజనీరింగ్ మధ్య ఒప్పంద జరిగిందని కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ షేక్ ముజీర్ అన్నారు. ఇటువంటి ఉన్నత సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోవడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుందని ఎండీ షేక్ మస్తాన్‌షరీఫ్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్ అన్నారు.


అవగాహన పత్రాలు మార్చుకుంటున్న ఈశ్వర్ కళాశాల, వోల్క్స్ పాంథమ్ ప్రతినిధులు

ఏనుగుపాలెంలో రీసర్వేపై గ్రామసభ

వినుకొండటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రీసర్వే కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు తహసీల్దార్ సురేష్‌నాయక్ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం జన వరి నెల నుంచి ఏనుగుపాలెంలో చేపట్టిన రీసర్వే కార్యక్రమాన్ని అధికారులు విజయవంతంగా నిర్వహించారు. గ్రామంలో 814 సర్వే నంబర్లు ఉండగా రీసర్వేలో భాగంగా మొత్తం 5,437 ఎకరాల భూమిని గుర్తించి 5,327 ఎల్‌పీ నంబర్లను కేటాయించారు. రీసర్వే వల్ల ఏమైన సమస్యలు, సలహాలు అందించాలంటూ తహసీల్దార్ ఆధ్వర్యంలో గ్రామసభ బుధవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మాదినేని వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ప్రజల నుంచి వచ్చే వినతులను స్వీకరించారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరలో పరిష్కరిస్తామని తహసీల్దార్ సురేష్ సూచించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సురేష్

పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలి

● అఖిలపక్ష సమావేశంలో తీర్మానించిన సభ్యులు

వినుకొండ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాషువా సాంస్కృతిక సమాఖ్య ఆధ్వ ర్యంలో పల్నాడు జిల్లాకు జాషువా పల్నాడు జిల్లాగా నామకరణ చేయాలని వినుకొండ అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం వినుకొండ సీనియర్ న్యాయవాది పీజే లూకా అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశంలో వివిధ పార్టీలు, ప్రజా సంఘ నాయకులు పల్నాడు జిల్లాకు జాషువా పల్నాడు జిల్లాగా పేరు పెట్టాలని ఏకగ్రీవంగా తీర్మానిం చారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ద్వారా ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రికి ఈ తీర్మాన అర్జీని పంపించి తదుపరి కార్యాచరణకు అఖిలపక్ష కమిటీని చిలకల జాన సుందర్‌రావు, కన్వీనర్‌గా, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సం ఘాల నుంచి కో కన్వీనర్‌లాగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ గౌరవ అధ్య క్షుడు పీజే లూకా మాట్లాడుతూ జాషువా జన్మస్థలమైన మన జిల్లాకు ఆయన పేరు పెట్టడం అన్ని వర్గాల వారు అభినందించే చర్యగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, సీపీఐ, సీపీఎం, (సీపీఐ ఎంఎల్), ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, ప్రజాసంఘాల నాయకులు బూదాల శ్రీనివాసరావు, పిన్నబోయిన శ్రీనివాస్, కె.మల్లికార్జున, బొంకూరు వెంకటేశ్వర్లు, పీవీ సురేష్, దాసయ్య, బి.ఎలియేజర్, దాసరి కోటేశ్వరరావు, పులిమేల రూబెన్, కాసిం పీరా, తోట ఆంజనేయులు, పచ్చి గొర్ల సుధాకర్, భాగవతల రవికు మార్, రెడ్డిబోయిన ప్రసన్న, పౌలేష్, గుమ్మడి వెంకటేశ్వరరావు, బీవీ నాగేశ్వరరావు, టీచర్ అమృతపూడి రేవతి, మాచర్ల బుజ్జి, పిడుగు విజయ్, సీహెచ్ శ్యామ్ లింకన్, కుంపట మహేష్, అమృతపూడి రాజేంద్రప్రసాద్, కలుపు కోరి ఏసురత్నం పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న వివిధ ప్రజాసంఘాల నాయకులు

రైతుల అభ్యున్నతికి కృషి : చైర్మన్

ఈపూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకు పంటలను దాచుకునేందు యార్డులో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఈపూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ జరపల రాములు భాయ్ అన్నారు. యార్డు నూతన పాలకవర్గ సమావేశం బుధవారం జరిగింది. పలు అభివృద్ధి పనులు చేసేందుకు పాలక వర్గం తీర్మానం చేసింది. చైర్మన్ మాట్లాడుతూ యార్డులోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పంటలను కొనుగోలు చేస్తామని అన్నారు. సమావేశంలో యార్డు సెక్రటరీ సూరే శ్రీనివాసరావు, పాలక వర్గం సభ్యులు పాల్గొన్నారు.